మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ    ఎడిటర్ : నంద కిషోర్    సంపుటి : 08    సంచిక : 78    బుధవారం    27 - 08 - 2025    పేజీలు: 8    వెల: 4

## వచ్చే ఏడాదికి అందుబాటులోకి 4 పోర్టులు



2 లో..



### ఆపరేషన్ సిందూర్ ఇంకా

# ముగియలేదు

### పాకిస్థాన్‌కు సీడీఎస్ పరోక్ష హెచ్చరిక

మన గళం డెస్క్ : ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు, అది ఇప్పటికీ కొనసాగుతోంది" అని త్రివిధ దళాధిపతి (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, అయితే దానిని బలహీనతగా పొరబడకూడదని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని మౌలో ఆర్మీ వార్ కాలేజీలో మంగళవారం ప్రారంభమైన 'రణ్ సంవాద్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి 2 లో..

## క్లీన్ ఎనర్జీలో భారత్ సరికొత్త శకం



### ఇక మనమే గ్లోబల్ హబ్: ప్రధాని మోదీ

మన గళం, న్యూఢిల్లీ : ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ, ఎగుమతుల రంగంలో భారత్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఇకపై 'మేడ్ ఇన్ ఇండియా' ఈవీలు ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల రోడ్లపై పరుగులు పెట్టనున్నాయి. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఎగుమతులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని కూడా ఆయన ప్రారంభించడం విశేషం. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీ రంగాల్లో భారత్ ప్రపంచ హబ్‌గా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. "గతంలో ఈవీలకు అత్యంత కీలకమైన బ్యాటరీలను మనం పూర్తిగా 2 లో..



### నేను ఆట మొదలుపెడితే..

# చైనాకు వినాశనమే

### చైనాతో వాణిజ్య యుద్ధంపై డొనాల్డ్ ట్రంప్ ఘాటు వ్యాఖ్యల

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: చైనాతో కొనసాగుతున్న వాణిజ్య యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. బీజింగ్‌తో మంచి సంబంధాలు కోరుకుంటున్నప్పటికీ, వాణిజ్య వివాదాల్లో తమదే పైచేయి అని ఆయన స్పష్టం చేశారు. తమతో పోటీ పడాలని చూస్తే చైనాకు వినాశనం తప్పదని పరోక్షంగా, గట్టిగా హెచ్చరించారు. ఈ 2 లో..



### 12 మంది నిందితుల

# రిమాండ్ పొడిగింపు

### – సెప్టెంబర్ 3 వరకు రిమాండ్ పొడిగింపు

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి సహా 12 మంది రిమాండ్‌ను ఏసీబీ కోర్టు సెప్టెంబర్ 3వ తేదీ వరకు పొడిగించింది. రిమాండ్ గడువు ముగియడంతో ఈరోజు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. రిమాండ్ 2 లో..



### ప్రజల కోసం

# పనిచేయండి


- బ్యాంకర్ల తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి
- సీజన్ చివర్లో రైతులకు రుణాలిస్తే ఏం ప్రయోజనమని ప్రశ్న
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని హితవు

మన గళం, అమరావతి : కేవలం సమావేశాలు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని... బ్యాంకులు తమ నిర్ణయాలను ప్రజలు, రైతులు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగు ణంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ) సమావేశంలో మాట్లాడుతూ, బ్యాంకర్లు తమ పనితీరును మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే సగం కాలం గడిచిపోయి ందని, ఈ సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన బ్యాంకులు సీజన్ చివరిలో రుణాలు మంజూరు చేస్తే ప్రయోజనం 2 లో..




### జగన్ అక్రమాస్తుల కేసులో

# వాన్‌పిక్ కంపెనీకి ఎదురుదెబ్బ



మన గళం, హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టులో వాన్‌పిక్ కంపెనీకి ఎదురుదెబ్బ తగిలింది. జగన్ అక్రమాస్తుల కేసులో సీబీఐ చార్జ్‌షీట్ నుంచి తమ సంస్థ పేరును తొలగించాలని వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. వాన్‌పిక్ ఓడరేవుకు భూ కేటాయింపుల్లో అక్రమాలు, క్విడ్‌ప్రోకో జరిగిందంటూ గతంలో సీబీఐ అధికారులు అభియోగాలు మోపారు. వాన్‌పిక్ 2 లో..

# సిట్ చెబుతున్నవి కట్టు కథలు

### – లిక్కర్ స్కామ్‌లో తన పాత్ర ఏమాత్రం లేదన్న కసిరెడ్డి



మన గళం, అమరావతి : స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) చెబుతున్న విషయాలు సినిమా కథలను మించి ఉన్నాయని తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కస్టోడియల్ విచారణ పేరుతో తనను అరెస్టు చేశారని ఆయన ఈరోజు విజయవాడ ఏసీబీ కోర్టుకు తెలిపారు. తనపై 2 లో..

## ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

ప్రతిస్పందనగా చేపట్టిన ఆపరేషన్ పేరును ప్రస్తావిస్తూ పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు పంపారు. ఈ సందర్భంగా జనరల్ చౌహాన్ మాట్లాడుతూ, "భారత్ ఎల్లప్పుడూ శాంతి వైపే నిలబడుతుంది. మేము శాంతిని ప్రేమించే వాళ్ళం. అయితే దానిని ఆసరాగా చేసుకుని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదు" అని అన్నారు. గతంలో జరిగిన యుద్ధాలకు, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలకు వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన విశ్లేషించారు. దీనిని ప్రభావితం చేసే నాలుగు ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. "రాజకీయ లక్ష్యాలను సాధించడానికి చిన్నపాటి యుద్ధాలను ఉపయోగించే ధోరణి దేశాల మధ్య పెరిగింది. యుద్ధం, శాంతి మధ్య తేడా చెరిగిపోతోంది. ఒకప్పుడు యుద్ధాలు భూభాగం కోసం జరిగితే, ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ఎక్కువ విలువ ఇస్తున్నారు. గతంలో శత్రువులకు కలిగించిన నష్టం ఆధారంగా విజయాన్ని అంచనా వేసేవారు. కానీ ఇప్పుడు, ఆపరేషన్ల వేగం, కచ్చితత్వంతో కూడిన దాడులు విజయాన్ని నిర్ధారిస్తున్నాయి" అని ఆయన తెలిపారు. వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశం 'సశస్త్ర', 'సురక్షిత్', 'ఆత్మనిర్భర్'గా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. కేవలం సాంకేతికతలోనే కాకుండా, ఆలోచనలు, ఆచరణలో కూడా స్వయం సమృద్ధి సాధించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాయు, జల, భూతల మార్గాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు జరిగే ఈ 'రణ్ సంవాద్' సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించనున్నారు.

## ప్రజల కోసం పనిచేయండి




ఉండదని చంద్రబాబు అన్నారు. "రైతులకు అవసరమైనప్పుడు రుణాలు, ఇతర ఇన్‌పుట్‌లు అందించాలి. కాలం దాటిపోయాక ఇచ్చే రుణాలతో వారికి ఉపయోగం శూన్యం" అని ఆయన చెప్పారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకులు కూడా కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచించాలని, నూతన సంస్కరణలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థ అమెరికా, చైనా వంటి దేశాలకు సవాలు విసిరేలా ఎదుగుతోందని, ఈ అభివృద్ధిలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. సంపద సృష్టితో పాటు పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలను తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. 2047 నాటికి భారత్‌ను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాలన్న లక్ష్యంలో భాగంగా బ్యాంకులు సమష్టిగా పనిచేయాలని కోరారు.

ఈ సమావేశంలో వ్యవసాయం, ఎంఎస్‌ఎంఈ, గ్రామీణ బ్యాంకింగ్ సేవలపై సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు గానూ రూ.1,80,540 కోట్ల రుణ లక్ష్యం కాగా, జూన్ నాటికి రూ.94,666 కోట్లు మంజూరు చేసినట్లు బ్యాంకర్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులకు రూ.985 కోట్లు, ఎంఎస్‌ఎంఈ రంగానికి రూ.49,831 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ.5,937 కోట్ల రుణాలు అందించినట్లు వివరించారు. వీటితో పాటు విద్యా రంగానికి రూ.252 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ.1,146 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

## క్లీన్ ఎనర్జీలో భారత్ సరికొత్త శకం



దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోంది. మూడు ప్రముఖ జపాన్ కంపెనీలు కలిసి భారత్‌లోనే బ్యాటరీ సెల్స్, ఎలక్ట్రోడ్‌లను తయారు చేస్తున్నాయి. ఇది మన దేశ హైబ్రిడ్ వాహనాల మార్కెట్‌కు కొత్త ఊపునిస్తుంది"

అని ఆయన వివరించారు. భారత్-జపాన్ మధ్య బంధం కేవలం వ్యాపారానికే పరిమితం కాదని, చారిత్రక, సాంస్కృతిక మూలాలున్నాయని ప్రధాని గుర్తుచేశారు. "సుజుకి వంటి జపాన్ కంపెనీలు ఇక్కడ కార్లను తయారు చేసి, తిరిగి జపాన్‌కే ఎగుమతి చేస్తున్నాయి. ఇదే మన రెండు దేశాల సంబంధాల బలానికి నిదర్శనం. మారుతి సుజుకితో మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకెళుతోంది" అని మోదీ వ్యాఖ్యానించారు. గత దశాబ్దంలో తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాల ఫలాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. "వ్యాపార అనుకూల వాతావరణం, లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో పెట్టుబడులకు అనువైన మార్గాలను సృష్టించాం. ఫలితంగా పదేళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ 500 శాతం పెరిగింది" అని అన్నారు. భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, "మేం ఇక్కడితో ఆగిపోం. ఇకపై సెమీకండక్టర్ల తయారీపై దృష్టి పెడతాం. త్వరలో ఆరు ప్లాంట్లు సిద్ధం కాబోతున్నాయి. అదేవిధంగా కీలక ఖనిజాల కోసం 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించాం" అని ప్రధాని వెల్లడించారు. అభివృద్ధి అనుకూల విధానాల రూపకల్పనలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## జగన్ అక్రమాస్తుల కేసులో వాన్‌పిక్ కంపెనీకి ఎదురుదెబ్బ

ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ పేరుతో భూసేకరణ జరిగిందని సీబీఐ అధికారులు పేర్కొన్నారు. అయితే తమ పేరును సీబీఐ చార్జిషీట్ నుంచి క్వాష్ చేయాలని 2022 జూలైలో వాన్‌పిక్ కంపెనీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ విచారణకు హైకోర్టు అనుమతించింది. అయితే ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సీబీఐ సవాలు చేసింది. సీబీఐ వాదనలు పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు.. వాన్‌పిక్ పిటిషన్‌పై మరోసారి విచారణ జరపాలని హైకోర్టును ఆదేశించింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం వాన్‌పిక్ ప్రాజెక్టుపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా వాదనలు విన్న హైకోర్టు.. వాన్‌పిక్ పిటిషన్‌ను కొట్టివేసింది.

## సిట్ చెబుతున్నవి కట్టు కథలు

మోపిన అభియోగాలను పూర్తిగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాజ్ కసిరెడ్డి మాట్లాడుతూ, "లిక్కర్ స్కామ్‌లో నా పాత్ర ఎక్కడా లేదు. నా తప్పు లేకపోయినా, తప్పు చేసినట్లుగా నాపై తప్పుడు ఆధారాలను సృష్టించారు" అని ఆరోపించారు. తనపై ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క కేసు కూడా నమోదు కాలేదని, గతంలో ఏ కేసులోనూ అరెస్టు కాలేదని ఆయన గుర్తుచేశారు. సిట్ అధికారులు చెబుతున్న కట్టుకథలు నమ్మశక్యంగా లేవని ఆయన అన్నారు. రూ.11 కోట్ల నగదు గురించి ప్రస్తావిస్తూ, "ఆ రూ.11 కోట్లు నిజంగా నావే అయితే, వాటిపై నా వేలిముద్రలు ఉండాలి కదా? అసలు అంత పెద్ద మొత్తంలో నగదు ఒకే వ్యక్తి దగ్గర ఉంటుందా?" అని రాజ్ కసిరెడ్డి ప్రశ్నించారు. ఈ కేసులో సిట్ అధికారులు ఇప్పటివరకు దాదాపు 300 మందిని విచారించారని, వారిలో ఒక్కరంటే ఒక్కరు కూడా తనకు పరిచయం లేదని ఆయన తేల్చిచెప్పారు. "కేసులో ప్రస్తావిస్తున్న చాలా మంది పేర్లను నేను ఇప్పుడే మొదటిసారి వింటున్నాను. సిట్ విచారించిన వారిలో కనీసం ఓ ఐదుగురిని పిలిచి, నేను తెలుసా అని అడగండి" అని ఆయన కోరారు.

## నేను ఆట మొదలుపెడితే.. చైనాకు వినాశనమే

సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, వాణిజ్య పోరులో చైనా వద్ద కొన్ని కార్డులు ఉంటే, తమ వద్ద అంతకంటే అద్భుతమైన కార్డులు ఉన్నాయని అన్నారు. "వాళ్ల దగ్గర కొన్ని కార్డులు ఉన్నాయి. కానీ మా దగ్గర అంతకంటే గొప్ప కార్డులు ఉన్నాయి. అయితే నేను వాటితో ఆడాలనుకోవడం లేదు. ఒకవేళ నేను ఆ కార్డులతో ఆడితే, చైనా నాశనమవుతుంది. అందుకే ప్రస్తుతానికి ఆ పని చేయను" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. కొన్ని రకాల అరుదైన ఖనిజాల సరఫరాను నిలిపివేయడం లాంటి చర్యలకు చైనా పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. అలాంటి పరిస్థితులు తలెత్తితే చైనాపై 200 శాతం వరకు సుంకాలు విధించడానికి కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. వాణిజ్యపరంగా తమ ఆధిపత్యాన్ని బీజింగ్ సవాలు చేయలేదని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో, ఇరు దేశాల మధ్య సత్సంబంధాల ప్రాముఖ్యతను కూడా ట్రంప్ ప్రస్తావించారు. ఈ ఏడాది చివర్లో గానీ, ఆ తర్వాత కొద్దికాలానికి గానీ నేను చైనా పర్యటనకు వెళ్తాను. రెండు దేశాల మధ్య అద్భుతమైన సంబంధాలు ఉండబోతున్నాయి" అని ఆయన తెలిపారు. ప్రస్తుతం వాణిజ్యపరంగా విభేదాలు ఉన్నప్పటికీ, భవిష్యత్తులో సంబంధాలు మెరుగవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## వచ్చే ఏడాదికి అందుబాటులోకి 4 పోర్టులు

- రోడ్డు, రైలు మార్గాలతో అనుసంధానం - అధికారులకు టార్గెట్ ఫిక్స్ చేసిన ప్రభుత్వం - ఏపీలో ఇక మరింత వేగంగా పోర్టుల నిర్మాణ పనులు



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే పోర్టుల పనులను వేగంగా పూర్తి చేసి 2026 నాటికి వాటిని వినియోగంలోకి తేవాలని అధికారులకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. అప్పటిలోగా పోర్టులను అనుసంధానిస్తూ రోడ్డు, రైలు మార్గాల కనెక్టివిటీ ప్రాజెక్టులను ప్రతిపాదించింది. పొరుగు రాష్ట్రాలకు కూడా పోర్టు సేవలు విస్తరించేలా ప్రతిపాదనలు రెడీ చేసింది. దీనికోసం తెలంగాణ, ఒడిశాల్లో డ్రైపోర్టులు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి పోర్టులను అనుసంధానించే ప్రతిపాదనలను రూపొందించింది. సముద్ర తీరం వెంట ప్రతి 50 కిలో మీటర్లలకు పోర్టు, ఆధారిత పరిశ్రమల ఏర్పాటు ద్వారా మొత్తంగా 20 పోర్టులను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. రామాయపట్నం పోర్టు: రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు 69% పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి ఈ పోర్టును వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. అయితే, భారీ సైజు నౌకల రాకపోకలకు వీలుగా ప్రస్తుతం ప్రతిపాదించిన డ్రెడ్జింగ్‌ను 16 నుంచి 18.5 మీటర్లకు పెంచాలంటూ నిర్మాణ సంస్థ ప్రతిపాదన చేసింది. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం అనుమతిస్తే గడువు పొడిగించే అవకాశం ఉంది. మొదటి దశలో 4 బెర్తులు నిర్మించాల్సి ఉండగా ప్రస్తుతం 1 పూర్తయింది. 3.7 కిలో మీటర్ల దక్షిణ, 1.35 కిలో మీటర్ల మేర ఉత్తర బ్రేక్ వాటర్ పనులు కొనసాగుతున్నాయి. చీఎ-16తో ఉమ్మడి ప్రకాశం జిల్లా చేవూరు జంక్షన్ దగ్గర అనుసంధానం చేస్తారు. 2026 నవంబరు నాటికి మచిలీపట్నం పోర్టును పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. ప్రస్తుతం 45.5% మేర పనులు పూర్తయ్యాయి. మొదటి దశలో 4 బెర్తులు 16 బెర్తులకు విస్తరించనున్నారు. ఈ పోర్టు ద్వారా ఏడాదికి 36 మిలియన్ టన్నుల సరకు రవాణా చేయవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో డ్రైపోర్టును ఏర్పాటు చేసి అక్కడి నుంచి మచిలీపట్నానికి సరకు చేర్చే ప్రతిపాదనలు ఉన్నాయి. బీచ్‌రోడ్డును 638 కోట్ల రూపాయలతో 6 లేన్ల రోడ్డుగా అభివృద్ధి చేసి, చీఎ-65కు అనుసంధానం చేసే ప్రతిపాదన ఉంది. దీనిని కేంద్ర ప్రభుత్వం పరిశీలనకు పంపారు. మూలపేట పోర్టు: మూలపేట పోర్టు 54.01% నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. 2026 మే నాటికి ఈ పోర్టును వినియోగంలోకి తేనున్నారు. ఈ పోర్టును ఏడాదికి 25 నుంచి 30 మిలియన్ టన్నులు సరకు రవాణా లక్ష్యం. ఒడిశా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో డ్రై పోర్టులు నిర్మించి మూలపేట పోర్టుతో అనుసంధానం చేయనున్నారు. చెన్నై-కోల్‌కతా చీఎ-16తో టెక్కలి జంక్షన్ వద్ద అనుసంధానం చేస్తారు. అదే విధంగా హౌవ్‌డా-చెన్నై రైలు మార్గంతోనూ దీనిని కలుపుతారు.

## 12 మంది నిందితుల రిమాండ్ పొడిగింపు



పొడిగింపు నేపథ్యంలో మిథున్ రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించగా, మరో 9 మంది నిందితులను విజయవాడ జిల్లా జైలుకు, ఇద్దరిని గుంటూరు జైలుకు తరలించారు. మరోవైపు, ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ దాఖలు చేసిన చార్జిషీట్‌లపై ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. రెండు ఛార్జిషీట్లలో 21కి పైగా అభ్యంతరాలున్నట్టు న్యాయమూర్తి తెలిపారు. నిందితులు అందరికీ ముద్దాయి కాపీలు అందజేశారా? అని ప్రశ్నించారు. ఈ కేసుకు అవినీతి నిరోధక చట్టం ఎలా వర్తిస్తుందో చెప్పాలని అడిగారు. దాఖలు చేసిన డాక్యుమెంట్లకు సరైన క్రమ సంఖ్యలు లేవని, వాటిని సరిచేసి మళ్లీ అందించాలని స్పష్టం చేశారు.

## భూమనపై బీజేపీ నేత ఫైర్



మన గళం, అమరావతి : ఐఏఎస్ శ్రీలక్ష్మిని అవినీతి అనకొండ అంటూ పరోక్షంగా వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ నేత, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మహిళపై ఎవరైనా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారా అని మండిపడ్డారు. ఐఏఎస్ శ్రీలక్ష్మి ఎవరి వల్ల జైలుకు వెళ్లిందో తెలియదా అని ప్రశ్నించారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఇప్పుడు రాజకీయ నిరుద్యోగిగా మారారని భానుప్రకాశ్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత నుంచి ఆయన మానసిక పరిస్థితి సరిగ్గా లేనట్లు ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఓ మహిళా అధికారిణి పై ఇలాంటి భాషలో మాట్లాడటం సరికాదని హితవు పలికారు. అసలు ఆమె ఎవరి కారణంగా జైలుకు వెళ్లాల్సి వచ్చిందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసుని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే శ్రీలక్ష్మి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించారని గుర్తుచేశారు. టీడీఆర్ బాండ్ల వ్యవహారంలో అవకతవకలు జరిగాయన్నది నిజం కాదా అని ప్రశ్నించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## ..స్కూల్ కోసం 4 ఎకరాల భూమి దానం.







యాంకర్ పార్ట్.... కర్నూలు జిల్లా ఆలూరు మండలం ముద్దనగేరి గ్రామంలో విద్యార్థుల చదువు కోసం జిల్లా పరిషత్ హైస్కూల్ కోసం 4 ఎకరాల తన స్వంత భూమిని టిడిపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి దానంగా ఇచ్చారు. సమగ్ర శిక్ష అధికారి డి.ఇ విష్ణువర్ధన్ రెడ్డి , ఎంఈఓ లు స్థలాన్ని పరిశీలించారు.ఈరోజుల్లో సెంటు భూమి కనిపించిందంటే చాలు క్షణాలలోకి కబ్జా చేయటం చూసాం. విద్యార్థులు చదువుకునేందుకు పాఠశాల గదిలో నిర్మించేందుకు అవసరమైన ప్రభుత్వ భూమి లేకపోవటంతో విద్యార్థులు చదువులకు స్వస్తిపలూకుతున్నారు. ఈ పరిస్థితులలో గ్రామానికి సంబంధించిన విద్యార్థుల భవిష్యత్తు కోసం టిడిపి రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి నారాయణరెడ్డి విశాల హృదయంతో ముందుకొచ్చారు.

తన పేరిట ఉన్న నాలుగు ఎకరాల భూమిని హైస్కూల్ కోసం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు.

విద్యార్థుల చదువులను దృష్టిలో ఉంచుకుని ఎంతో విలువైన భూమిని దానం చేసిన నారాయణరెడ్డి ని పలువురు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా ఇవాళ నాలుగు ఎకరాల భూమిని సమగ్ర శిక్ష అధికారి డి.ఇ విష్ణువర్ధన్ రెడ్డి , ఎంఈఓ చిరంజీవి రెడ్డి లు వచ్చి భూమిని పరిశీలించి నారాయణరెడ్డి సేవలను కొనియాడారు. బైట్. నారాయణ రెడ్డి.

## మెరుస్తున్నా.. ముప్పే ఎక్కువ



– ఎల్ఈడీ హెడ్‌లైట్లతో పెరుగుతున్న ప్రమాదాలు

మనగళం, కర్నూలు సిటీ : ఇటీవలి కాలంలో కొత్తగా మార్కెట్‌లోకి వచ్చే చాలా వాహనాల్లో ఎల్ఈడీ హెడ్‌లైట్లు అధికారికంగానే అమర్చబడి వస్తున్నాయి. సాధారణ హాలోజన్ బల్బుల కంటే ఇవి ఎక్కువ వెలుతురు ఇస్తున్నప్పటికీ, రాత్రి వేళల్లో రహదారులపై భద్రతకన్నా ప్రమాదాలకు ఎక్కువ కారణమవుతున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాల ఎల్ఈడీ లైట్లు కంటి చెదిరే వెలుగుతో పడటంతో డ్రైవర్లకు ఒక్కసారిగా దృష్టి మసకబారుతుంది. ఆ క్షణాల్లోనే రోడ్డుపై గుంతలు, వాహనాలు, పాదచారులు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిపుణులు చెబుతున్న ప్రకారం, ఎల్ఈడీ లైట్లలోని బ్లూ లైట్ కిరణాలు కంటి రెటీనా పై ఒత్తిడి పెంచి తాత్కాలిక దృష్టి కోత కలిగిస్తాయి. గతంలో వాహనాల హెడ్‌లైట్లపై సగం భాగం నల్లపూత ఉండేది. దాంతో వెలుగు నేరుగా కళ్లపై పడకుండా, రోడ్డుపైనే కేంద్రీకృతమై ఉండేది. ఆ పద్ధతి భద్రతకే మేలని చాలామంది నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు ఆ నియమాన్ని మళ్లీ తీసుకురావాలని, హాలోజన్ బల్బులను తిరిగి ఉపయోగించాలని వాహన వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. రాత్రిపూట జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో గణనీయమైన శాతం ఈ సమస్య వల్లనే జరుగుతోందని పోలీసులు చెబుతున్నారు. కాబట్టి వాహనాల్లో ఎల్ఈడీ లైట్ల వినియోగంపై సమీక్ష చేసి, భద్రత దృష్ట్యా పాత విధానాలను మళ్లీ అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ప్రెస్ క్లబ్ సభ్యత్వం ఎంతో అవసరం



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ప్రెస్ క్లబ్ సభ్యత్వం తీసుకోవడం ఎంతో అవసరమని సీనియర్ పాత్రికేయులు రామాంజనేయులు తెలిపారు. మంగళవారం ప్రెస్ క్లబ్ కార్యాలయానికి ఆయన స్వయంగా వచ్చి సభ్యత్వం నమోదు చేయించుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొత్తూరు సత్యనారాయణ గుప్త చేతుల మీదుగా రామాంజనేయులు సభ్యత్వం తీసుకున్నారు. తర్వాత ప్రెస్ క్లబ్ కార్యాలయం ఎదుట సీనియర్ పాత్రికేయులు రామాంజనేయులు మొక్కను నాటారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఒక నాటి రాజధాని కర్నూల్ అని, అయినా ప్రెస్ క్లబ్ లేకపోవడం శోచనీయమన్నారు. ప్రజా సంఘాలకు తమ సమస్యలను చెప్పుకునే వేదిక అవుతుందని, అదేవిధంగా పాత్రికేయులకు ఉండటానికి, సమావేశాలు జరుపుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా భవన నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కర్నూలు ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా క్వార్టర్స్ కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన తనవంతుగా ప్రెస్ క్లబ్ కు 20 కుర్చీలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఇంచార్జ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



మనగళం, కల్లూరు : పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మంగళవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం రూ 6,48,599 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఆరోగ్య సమస్యలతో పేదలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతోనే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గడ్డం సురేష్ కు రూ. 2,14,670, వంగాల వెంకటేశ్వరమ్మకు రూ. 30028, కురువ పెద్ద మద్దిలేటికి రూ. 45,350, సింగసని సుధాకర్ రెడ్డికి రూ.18,000, ద్వారం గోపాల్ రెడ్డికి రూ. 40295, గడిగరేవుల వెంకట శివరామయ్యకు రూ. 51272, చిట్ల రామిరెడ్డికి రూ. 52,000, బోయ లక్ష్మిని దేవి (డెత్) కుటుంబ సభ్యులకు రూ. 43,092, యగ్గోని ఉప్పరీ నారాయణమ్మకు రూ. 41,112, ముని స్వరూప రాణికి రూ. 31,513, ఎల్లమ్మ చైల్డ్ కు రూ. 81,267 చొప్పున చెక్కులను అందజేశారు.

## రహదారుల విస్తరణ పనులు త్వరలో ప్రారంభం

– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్
– ఆస్తి ప్రభావిత యజమానులకు పరిహారం త్వరగా అందించాలి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలోని రహదారి విస్తరణ పనులను త్వరలో ప్రారంభించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఉస్మానియా కళాశాల వద్ద విస్తరణ పనులు చేపట్టాల్సిన రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కిడ్స్ వరల్డ్ కూడలి నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు మాస్టర్ ప్లాన్ (ఆర్డీపి-2) ప్రకారం రహదారి విస్తరణ చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకోసం ఆస్తి ప్రభావిత యజమానులకు పరిహారం త్వరలో అందిస్తామని, మొత్తం 740 మీటర్ల పొడవున పనులు జరుగుతాయని, దాదాపు 183 యజమానుల ఆస్తులు ప్రభావితమవుతాయని చెప్పారు. నగరాభివృద్ధి కోసం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, పరిహారం వీలైనంత త్వరగా అందిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, బిల్డింగ్ ఇన్స్పెక్టర్ మధుగోపాల్, ఎం. అష్రఫక్ తదితరులు పాల్గొన్నారు.

## బలవంతపు భూసేకరణ ఆపండి



మనగళం, కర్నూలు సిటీ : బలవంతపు భూసేకరణ రద్దు చేయా లని డిమాండ్ చేస్తూ జిల్లా రెవెన్యూ అధికారికి మంగళవారం రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే వెంకటేశు లు, రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు వీరశేఖర్, నారాయణ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు హనుమంతు, కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్య దర్శులు మాట్లాడారు. 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని, బలవంతపు భూసేకరణ రద్దు చేయా లని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో అభివృద్ధి పేరుతో వేల ఎకరాలు భూములను రైతుల నుండి బలవంతంగా తీసుకోవడం వల్ల ఉపాధి కోల్పోయి వలస బాట పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సోలార్ ఎనర్జీ పేరుతో సోలార్ కంపెనీలు పెద్ద ఎత్తున రైతులు భూములను కొల్లగొట్టుతున్నారని ఆరోపించారు. ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో సోలార్ కంపెనీ వాళ్ళు ఏజెంట్లను నియమించుకొని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ఎకరాకు మూడు లక్షల రూపాయలు చొప్పున స్వాధీనం చేసుకుంటున్నారని, అలాగే ఏడాదికి 30 వేల రూపాయలు చొప్పున లీజుకు 30 సంవత్సరాల అగ్రిమెంట్తో స్వాధీనం చేసుకుంటున్నారన్నారు. ప్రతి ఎకరాకు లక్షలాది రూపాయలు లాభాలు దండుకొని రైతులకు వేల రూపాయలు మాత్రమే చెల్లించి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ప్రజాభిప్రాయ సేకరణలో భూములు ఇవ్వడానికి నిరాకరించినప్పటికీ బలవంతంగా భూములు తీసుకుంటామని, కోర్టుకెళ్తే నష్టపరిహారం తక్కువ వస్తుందని అధికారులు రైతులను బెదిరిస్తున్నారని ఆరోపించారు.అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## బయో కెమిస్ట్రీ విభాగానికి అధునాతన పరికరాలు




మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల బయో కెమిస్ట్రీ విభాగానికి కోటి 20 లక్షల రూపాయల విలువైన అధునాతన పరికరాలను (క్లినికల్ కెమిస్ట్రీ అనలైజర్ మిషన్ లు) బ్యాక్ మ్యాన్ కంపెనీ ప్రతినిధులు స్పాన్సర్ చేశారని ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోనే హైయెస్ట్ ల్యాబ్ టెస్టులు బయో కెమిస్ట్రీ విభాగం నుండే చేస్తున్నామన్నారు. పేషంట్ల రద్దీ దృష్ట్యా త్వరగా రిపోర్టు అందించడానికి అధునాతనమైన యంత్రాలు అందుబాటులో తీసుకురావడం జరిగిందన్నారు. పేషెంట్లకు ఖచ్చితమైన రిపోర్ట్, ఫాస్ట్ రిపోర్టింగ్ తో మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. అధునాతనమైన వైద్య పరికరాలు అందించిన బ్యాక్ మ్యాన్ కంపెనీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బయో కెమిస్ట్రీ హెచ్ ఓ డి డా.రూత్ లావణ్య, మాట్లాడుతూ ఆసుపత్రిలోని బయో కెమిస్ట్రీ విభాగానికి సహాయ సహకారాలు, అధునాతనమైన వైద్య పరికరాలు రావడానికి ప్రధాన భూమిక పోషించిన ఆసుపత్రి సూపర్డెంట్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపల్ డా.సాయి సుధీర్, డాక్టర్ సింధ్య, ఇన్చార్జి సి ఎస్ ఆర్ ఎం ఓ డా.వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్ డా.శివబాల, బయో కెమిస్ట్రీ హెచ్ ఓ డి డా.రూత్ లావణ్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవి లత, అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణమోహన్, డా.సుధాకర్, ఏపీ బ్యాక్ కౌల్టర్ మేనేజర్ దిప్షిక తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి టీజీ



మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్ జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియచేశారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్రాభివృద్ధి తో పాటు ప్రజలందరి జీవితాల్లో శాంతి, ఐశ్వర్యం, ఆనందం నిండాలని కోరుకుంటున్నానన్నారు. గణనాథుడి దయతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలన్నారు. పర్యావరణహిత గణేష్ విగ్రహాలను ప్రతిష్టించి, పండుగను సంతోషంగా, ఆనందంగా జరుపుకోవాలని మంత్రి ఆకాక్షించారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ విక్రాంత్ పాటిల్



మనగళం, కర్నూలు క్రైం: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది, మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా వినాయక చవితి వేడుకలు, గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పార్టీ నుండి 10 లక్షల రూపాయలు




జనవరి 3, 2025 సంవత్సరం నాడు రాయల చెరువు సమీపాన కృష్ణ పాడు రైల్వే స్టేషన్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో తుగ్గలి మండలం చేన్నంపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ చౌదరి భార్య సుమలత యాక్సిడెంట్లో మరణించడం జరిగినది. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉన్నందున వారికి పార్టీ నుండి 10 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ వచ్చినది ఈరోజు పత్తికొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు శాసనసభ సభ్యులు శ్రీ శ్యామ్ కుమార్ చేతులమీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగినది.

## జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ పి.రంజిత్ బాషా



మనగళం, కర్నూలు సిటీ : జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుని కృపతో జిల్లా అభివృద్ధితో పాటు ప్రజలంతా సంతోషంగా ఉండాలని, ప్రజలకు మంచి జరగాలని కోరారు. ప్రతి పనిలో విజయం చేకూరాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, మట్టి వినాయకుని విగ్రహాలతో పూజలు జరుపుకుని, సంతోషంతో పండుగ చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా మదర్ థెరిసా జయంతి



మనగళం, కర్నూలు సిటీ : మదర్ థెరిసా జయంతిని కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సంకల్ బాగ్ నందుగల మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ కర్నూల్ సిటీ అధ్యక్షులు జీలాని బాషా, కోడుమూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అనంతరత్నం మాదిగ, ఐఎన్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎం ఖాద్రి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ తదితరులు మదర్ థెరిస్సా త్యాగాలను గుర్తు చేశారు. పేదలు, అనాథలకు ఆమె తన జీవితాన్నే అంకితం చేశారన్నారు.

## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్
- మండపాల వద్ద స్వచ్ఛతకు సహకరించాలి
- ఉత్సవ కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం




మనగళం, కర్నూలు కార్పొరేషన్ : సెప్టెంబర్ 4వ తేదీన జరగనున్న గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. గతేడాది నిమజ్జనం రోజున చోటుచేసుకున్న లోపాలు పునరావృతం కాకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు.. లైటింగ్, క్రేన్లకు అదనపు డ్రైవర్లు, అందుబాటులో మెకానిక్‌లు, చెక్‌పోస్ట్ నుంచి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు మైక్ సిస్టమ్, మూడు షిఫ్టులుగా పారిశుద్ధ్య సిబ్బంది నియామకం వంటి అంశాలను కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ.. "ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిమజ్జనం జరగడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తాం. అందరి సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. అదేవిధంగా నగరంలోని గణేష్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినప్పుడు స్వచ్ఛతకు సహకరించాలని, వ్యర్థాలను ఒకచోట చేర్చి మున్సిపల్ సిబ్బందికి అందించేలా నిర్వాహకులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ గంగాధర్, ఏఈ వైష్ణవి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, సూపరింటెండెంట్లు మంజుర్ బాష, వాజిద్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వేణుగోపాల్, గోరంట్ల రమణ, రంగస్వామి, గిరిరాజ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : వినాయక చవితి పర్వదినాన్ని నగర ప్రజలు ఆనందంగా, ఐకమత్యంతో జరుపుకోవాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ మంగళవారం ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలుపుతూ.. వినాయక చవితి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని, సమాజంలో స్నేహం, సౌహార్దాన్ని పెంపొందించే పర్వదినం అన్నారు. విఘ్నేశ్వరుడు ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలను తొలగించి సుఖసంతోషాలు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండండి..మారుతి సకారం



మన గళం అవుకు : రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని డాక్టర్ మారుతి సకారం తెలిపారు. పట్టణంలోని పశు వైద్యశాల నందు మంగళవారం నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెలవారి టార్గెట్లన్నీ అచ్చువలేనని , సిబ్బంది సమయపాలన పాటించాలని తగు సూచనలను సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య అధికారి డాక్టర్ భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా ఐక్య వేదిక కార్యవర్గ సమావేశం



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక ప్రధాన కార్యాలయంలో మంగళవారం రాయలసీమ డివిజన్ అధ్యక్షురాలు భారతమ్మ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. కమిటీ సభ్యులు నడుచు కోవలసిన పద్ధతులను వివరించారు. మహిళా ఐక్య వేదిక బలోపేతానికి సభ్యులు శ్రమించాలని కోరారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు, హత్యలకు, దాడులకు, వ్యతిరేకంగా మహిళలంతా ఏకమై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కటిక భాను, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు ఆకుతోట పద్మావతి, కర్నూలు జిల్లా ఉపాధ్యక్షురాలు ఉసేన్ బీ, కోడుమూరు మండల అధ్యక్షురాలు దస్తగిరమ్మ, బేతంచర్ల మండల అధ్యక్షురాలు కోమ్ము పెద్దక్క, షేకున్ బి, లక్ష్మేశ్వరి, కన్యాకుమారి, షేక్ ఇస్మాత్, ఖాజా బి, తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు ఉద్యమించాలి



మనగళం, కర్నూలు సిటీ : మహిళలకు హక్కుల సాధనకు ఐకమత్యంగా ఉద్యమించాలని అఖిలభారత మహిళా సంఘం (ఐద్వా) నగర కార్యదర్శి కే అరుణ, మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఎస్.ఉమాదేవి, వార్డు కార్యదర్శి కే నాగజ్యోతి, సీపీఎం నగర కార్యదర్శి ఆర్ నరసింహులు పిలుపునిచ్చారు. కర్నూల్ నగరంలోని 23వ వార్డు శ్రీరామ్ నగర్ లో నాగుల కట్ట రామాలయం పక్కన అఖిలభారత మహిళా సంఘం విస్తృత సాయి సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు దేశ జనాభాలోసగభాగం ఉన్నా... 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని చట్టసభల్లోబిల్లుపెట్టి ఆమోదం చేయలేనటువంటిపాలకులు మనలను పరిపాలిస్తున్నారని విమర్శించారు. ఆధునిక ప్రపంచంలో కూడా మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని ధ్వజమెత్తారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్ల పూర్తి అయిన స్త్రీకి సమానత్వం దక్కడం లేదని, తల్లిగా.. చెల్లిగా.. అక్కగా.. కుటుంబ పెద్దగా సంసారం అనే చట్రాన్ని ముందుకు నడిపిస్తూ దిశా దశను నిర్ణయించే మహిళకు సమాజంలో రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కమిటీ పదిమందితో ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. వార్డు కార్యదర్శిగా ఆర్ నలిని, వార్డు అధ్యక్షులుగా కే నాగజ్యోతి, సహాయ కార్యదర్శిగా ఎస్ సరస్వతి, ఉపాధ్యక్షులుగా టి మౌనిక, కమిటీ సభ్యులుగా ఎస్ అనిలా, ఉషారాణి. దాసరి. మాధవి. జయలక్ష్మి. సునీత .ఉమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## జిల్లా ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ బస్తిపాటి నాగరాజు



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా ప్రజలకు ఎంపీ బస్తిపాటి నాగరాజు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వాసులు విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో జీవితంలో ఎదురయ్యే విఘ్నాలు, ఆటంకాలు తొలగి సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో అభివృద్ధి పథంలో సాగాలని కోరుకొంటున్నానన్నారు. పండుగను భక్తి శ్రద్దలతో ఆనందంగా జరుపుకోవాలని సూచించిన ఎంపీ మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

## దూకుడు పెంచిన యాపిల్ కంపెనీ..

మన గళం ఇండియాలో యాపిల్ ఫోన్ల తయారీని నిలిపివేయాలని ఒక వైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఆ కంపెనీకి ఒత్తిడి వస్తున్నా.. యాపిల్ కంపెనీ మాత్రం భారత్‌లో తన కార్యకలాపాలను మరింత దూకుడుగా విస్తరిస్తోంది.తాజాగా మన దేశంలో నాలుగో స్టోర్‌ను ప్రారంభించనున్నట్లు యాపిల్ కంపెనీ తెలిపింది. భారత్‌లో తయారీ, విక్రయ కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తున్న యాపిల్ నాలుగో యాపిల్ స్టోర్‌ను ఏర్పాటుచేయనున్నట్లు మంగళవారం ప్రకటించింది. మహారాష్ట్రలోని పుణెకు చెందిన కొరెగావ్ పార్క్‌లో సెప్టెంబర్ 4న దీనిని ప్రారంభించనుంది.అలాగే స్టోర్‌కు సంబంధించిన గ్రాఫిక్స్‌ను కూడా విడుదల చేసింది. బెంగళూరులోని స్టోర్ మాదిరిగానే పుణెలోని స్టోర్‌ను కూడా నెమలి కళాకృతితో తీర్చిదిద్దారు. ఈ స్టోర్ 10వేల చదరపు అడుగుల వైశాల్యంలో విస్తరించి ఉంటుందని సమాచారం. కొత్త ఐఫోన్ 17 లాంచ్ కానున్న నేపథ్యంలో ఈ ప్రారంభంపై ప్రకటన వచ్చింది. ఇప్పటికే ముంబయి, ఢిల్లీ, బెంగళూరులో స్టోర్లు ఉన్నాయి. భారత్‌లో వ్యాపార వృద్ధికి ఇంకా భారీ అవకాశాలున్నాయని గతంలో వ్యాఖ్యానించిన యాపిల్ సీఈఓ టిమ్‌కుక్..

## 28న మెగా డీఎస్సీ అభ్యర్థులకు సర్టిఫికెట్ ల వెరిఫికేషన్

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

మనగళం, కర్నూలు సిటీ : మెగా డీఎస్సీ అభ్యర్థులకు ఈనెల 28వ తేదీన సర్టిఫికెట్ ల వెరిఫికేషన్ ఉంటుందని, సజావుగా జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ పరిశీలనపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందని, 2645 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని కలెక్టర్ తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీ, శ్రీనివాస బీఎడ్ కాలేజీ, రాఘవేంద్ర బీఎడ్ కాలేజీ లలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందన్నారు. ఈ మేరకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమ యూనివర్సిటీకి స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాస బి.ఎడ్ కాలేజీకి హౌసింగ్ పీడీ చిరంజీవి, రాఘవేంద్ర బీ.ఎడ్ కాలేజ్ కి పీఏ టు స్పెషల్ కలెక్టర్ కొండయ్య ఇన్చార్జీలుగా వ్యవహరిస్తారని చెప్పారు. రాయలసీమ యూనివర్సిటీలో 8 బ్లాక్ లలో వెరిఫికేషన్ జరుగుతున్నందున ఒక్కొక్క బ్లాక్ కు ఒక్కొక్క అధికారిని ఇన్చార్జిగా నియమించాలని కలెక్టర్ డీఆర్వో ను ఆదేశించారు. ఇప్పటికే రెవెన్యూ సిబ్బందిని కొంతమందిని నియమించడం జరిగిందన్నారు. మూడు కేంద్రాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా అభ్యర్థులు సులభంగా కేంద్రాలకు వెళ్లే విధంగా మార్గదర్శనం చేస్తూ సైనేజ్ బోర్డు లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ డీఇఓ ను ఆదేశించారు. ప్రతి కేంద్రంలో నెట్ కనెక్షన్ కు ఏమాత్రం ఇబ్బంది లేకుండా పకడ్బందీ గా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా దివ్యాంగ అభ్యర్థులకు శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు. బస్టాండ్, నంద్యాల చెక్ పోస్ట్ దగ్గర అభ్యర్థులకు కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, డీఈవో శామ్యూల్ పాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.




## బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



- సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలి
- ఫైళ్లను ఆలస్యం చేయకుండా క్లియర్ చేయాలి
- నూతన కార్యాలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సేవలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పనిచేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ నగరపాలక కార్యాలయంలోని పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విభాగం సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరిగితే వారిలో అసంతృప్తి పెరుగుతుందన్నారు. కాబట్టి ఏ ఫైలు కూడా వాయిదా వేయకుండా, వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను సీరియస్‌గా పరిగణించి తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఫైళ్ల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి సమయపాలన తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ నిర్మాణంలో ఉన్న నూతన మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించారు. పనుల పురోగతి గురించి అధికారులను ఆరా తీశారు. ఈ కొత్త కార్యాలయం పూర్తయితే ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం లభిస్తుందని, పనులు నాణ్యతతో కూడినవిగా, వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రతి దశలో పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. అలాగే అక్కడ వెంటనే స్వచ్ఛత పనులను చేపట్టాలని, మున్సిపల్ కార్యాలయ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

అజరామరాలు... ముకేష్ పాటలు

ముకేష్ చంద్ మాథుర్ అంటే ఎవరు అని అడిగితే, భారత దేశంలో దాదాపు దేశ ప్రజలు తెలియదనే అంటారు. హిందీ సినీ నేపథ్య గాయకుడు ముకేష్ పేరు తెలియని వారు దాదాపు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. హిందీ సినీ గాయకునిగా సుపరిచితుడైన ముకేష్ పూర్తి పేరు ముకేష్ చంద్ మాథుర్ అంటే ఔనా అనే వారే తప్ప ఔను అనే వారు బహు అరుదుగా వుంటారు. హిందే సినీ సంగీతానికి మరపురాని మధుర గీతాలను అందించిన విలక్షణ గాయకుడు ముఖేష్. అతి పిన్న వయసులోనే లోకం వదిలి వెళ్లినా, జీవిత చరమాంకం వరకు ముఖేష్ పాడుతూనే వున్నారు. భౌతికంగా దూరమైనా, ఆయన పాడిన పాటలు అజరామరాలై, సంగీత ప్రియుల నోళ్ళలో దశాబ్దాలుగా నానుతూనే ఉన్నాయి. ముకేష్ (జూలై 22, 1923 – ఆగస్టు 27, 1976) 1950 నుండి 1970 ల మధ్యకాలంలో భారతీయ హిందీ సినిమా రంగం నేపథ్య ప్రముఖ గాయకుడు. ముకేష్, కొద్ది పాటలు పాడినా, నేటికినీ మరపురాని గాయకునిగా చిరస్మరణీయుడు. ఆయన పాటలు ఎన్నిసార్లు విన్నా, విసుగు రాకుండా ప్రతి సారీ ఆయన గాత్రంలో లీనం అవుతుండ డాన్ని బట్టి ముఖేష్ ప్రత్యేకత స్పష్టం అవుతున్నది. జూలై 22, 1923న ఢిల్లీ నగరంలో జోరవర్ చాంద్ మాథుర్, చంద్రాణి దంపతులకు ఆరవ సంతానంగా జన్మించారు. తండ్రి ఇంజనీరుగా ఉద్యోగం చేసేవారు. ముఖేష్ అక్క సుందర్ ప్యారికి సంగీతం నేర్పేందుకు ఒక పండిట్ వారి ఇంటికి వచ్చేవారు. దూరంగా ఉన్న గదిలో కూర్చొని ముఖేష్ ఆ సంగీత పండితుడు తన అక్కకు సంగీతం ఎలా నేర్పిస్తున్నారో శ్రద్ధగా గమనిస్తూ తనలో తనే పాడుకుంటూ ఉండేవారు. అలా సంగీతం పట్ల ముఖేష్‌కు అభిమానం ఏర్పడింది. మెట్రిక్యులేషన్ పూర్తి కాగానే కాలేజి చదువుకు వెళ్లకుండా ప్రభుత్వ నిర్మాణ శాఖలో ఉద్యోగంలో చేశారు. వుద్యోగం చేస్తూనే తన సంగీతాభిరుచికి మెరుగులు దిద్దుకునే ప్రయత్నం చేశారు. హార్మోనియం వంటి కొన్ని వాద్య పరికరాలను ఎలా వాయించాలో శిక్షణ తీసుకున్నారు. ముకేష్ దూరపు బంధువు, సినీ నటుడు మోతిలాల్‌కు ముఖేష్ స్వరం కొత్తగా, వినూత్నంగా తోచింది. తండ్రి అనుమతితో ముఖేష్‌ను బొంబాయి తీసుకెళ్లి పండిట్ జగన్నాథ్ ప్రసాద్ వద్ద సంగీత పాఠాలు నేర్పించారు. ఆ సంగీత పండిట్ వద్దకు హిందీ సినిమా పరిశ్రమకు చెందిన వాళ్లు వచ్చిపోతూ వుండేవారు. దర్శకుడు వీరేంద్ర దేశాయ్ ముఖేష్‌ను చూసి 1941లో 'నిర్దోష్' అనే సినిమాలో హీరోగా పరిచయం చేశాడు. ముఖేష్ సరసన నళిని జయవంత్ హీరోయిన్‌గా నటించింది. ఆ సినిమాలో ముఖేష్‌ది ఒక గాయకుడి పాత్ర. నీలకంఠ తివారి పాట రాయగా, అశోక్ ఘోష్ స్వరపరచిన 'దిల్ హి బుఝా హువా హెూ తో ఫసి–యే–బహార్ క్యా' అనే పాటను ముఖేష్ తొలిసారి పాడారు. రెండవ సినిమా వి.సి. దేశాయ్ నిర్మించిన 'ఆదాబ్ అర్'లో కూడా నళిని జయవంత్ సరసనే హీరోగా ముఖేష్ నటించారు. తర్వాత రామ్ దర్యాని దర్శకత్వంలో వచ్చిన 'దుఃఖ్ సుఖ్' (1942) సినిమాలో హీరోగా సితారాదేవి సరసన నటించారు. ఖేమ్ చంద్ ప్రకాష్ సంగీత దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సితారాదేవితో కలిసి రెండు యుగళ గీతాలు పాడారు. 'అబ్ దేర్ న కర్ సాజన్ పూలోం సే జో మిల్నా హై, మేరీ అటరియా పే ఆజావో పరదేశి పంఛీ' అనే ఈ రెండు పాటలు పాపులర్ అయ్యాయి. రాజకపూర్‌తో సాన్నిహిత్యం పెరిగిన తర్వాత 'ఆహ్' సినిమాలో క్యారేజ్ డ్రైవర్‌గా ముఖేష్ ఒక అతిథి పాత్రలో కనిపించారు. తర్వాత ముఖేష్ నేపథ్య గాయకుడిగా స్థిరపడాలని నిర్ణయించుకొని ఆ దిశగా అడుగులు వేశారు. గాయక నటుడు కె.ఎల్.సైగల్‌కు ముఖేష్ వీరాభిమాని. నేపథ్య గాయకుడుగా పరిచయమైన తొలిరోజుల్లో సైగల్ పంథాను ముఖేష్ అనుకరించే ప్రయత్నం చేసేవారు. నిజానికి సైగల్ ముఖేష్ పాడిన 'దిల్ జల్తా హై' పాటను విని ఆ కొత్త గళాన్ని హిందీ చిత్రసీమకు దొరికిన ఆణిముత్యంగా శ్లాఘించారు. దిలీప్ కుమార్ మహమ్మద్ రఫీని నేపథ్య గాయకుడుగా ఇష్టపడితే, ముఖేష్ రాజ్‌కపూర్‌కు ఆస్థాన గాయకుడయ్యారు. తోటి గాయకుల గళాలతో పోలిస్తే ముకేష్ గొంతుక ప్రత్యేకంగా వుంటుంది. ఆ ప్రత్యేకత అభిమానుల్ని ఆకట్టుకుని మైమరపించే సమ్మోహన అస్త్రంగా మారింది. నేపథ్య గాయకుడిగా శంకర్ జైకిషన్ సంగీత దర్శకత్వంలో ముఖేష్ 133 పాటలు పాడితే, కళ్యాన్ జీ ఆనంద్ జీ ఆధ్వర్యంలో 99 పాటలు పాడారు. ముఖేష్ గెలుచుకున్న నాలుగు ఫిలింఫేర్ బహుమతుల్లో మూడు సినిమాలకు శంకర్ జైకిషనే సంగీత దర్శకులు కావడం విశేషం. అవి 'సబ్ కుచ్ సీఖా హమ్ నే' (అనారి –రాజకపూర్), 'సబ్ సే బడా నాదాన్ వహీ హై' (పెహచాన్ – మనోజ్ కుమార్), 'జై బోలో బేయిమాన్ కి' (బేయిమాన్– మనోజ్ కుమార్), 'కభీ కభీ మేరె దిల్ మే ఖయాల్ ఆతా హై' (కభీ కభీ – అమితాబ్ బచన్) పాటలు. 1974లో సలీల్ చౌదరి సంగీతం సమకూర్చిన 'రజనీగంధ' సినిమాలో ముఖేష్ పాడిన 'కహి బార్ యూ హి దేఖా హై' పాటకు జాతీయ బహుమతి లభించింది. ముఖేష్ మొత్తం మీద 1300 పాటలు పాడారు. ఒక నాటి మేటి క్రికెటర్లు భగవత్ సుబ్రహ్మణ్య (బి.ఎస్) చంద్రశేఖర్ , సునీల్ మనోహర్ గవాస్కర్, సయ్యద్ కిర్మాణి, గుండప్ప విశ్వనాథ్‌లకు ముఖేష్ పాటలంటే ఎంతో ఇష్టం. డ్రెస్సింగ్ రూమ్‌లో స్పూర్తి పొందాలని వాళ్లు ముఖేష్ పాటలు లో గొంతుకలలో హమ్ చేసేవారు. అమెరికా పర్యటనలో వుండగా ముఖేష్‌కు గుండెనొప్పి వచ్చింది. డెట్రాయిట్ (మిచిగన్ రాష్ట్రం)లోని హెూటల్ రూమ్‌లో ముఖేష్ తన 53వ (27 ఆగస్టు 1976) ఏట అసువులు బాశారు. "ముఖేష్ భయ్యాకు వచ్చిన మంచి పాటలు నాకు రాలేదు. ఆయన యెంత అదృష్టవంతుడో" అని కిషోర్ కుమార్ ఓ సందర్భంలో అన్నాడట. ముకేష్ అంటే రాజ్ కపూర్, రాజ్ కపూర్ అంటే ముకెష్ గా సాగింది వాళ్లిద్దరి అనుబంధం. అందుకే ముకేష్ మరణంతో, రాజకపూర్... 'నా గొంతు మూగపోయింది. నా ఆరో ప్రాణం గంగలో కలిసింది' అంటూ రోదించారు.

## రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు




మనగళం, కర్నూలు సిటీ : రైతులను వివిధ రూపాలలో యూరియా, గిట్టుబాటు ధర, పత్తి దిగుమతి లాంటి విషయాలలో అన్ని కోనాలలో మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె ప్రభాకర రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి పిలుపు నిచ్చారు. మంగళవారం కర్నూలు నగరం లోని కొత్తబస్టాండ్ ఇందిరాగాంధీ నగర్ లో ఉన్న సుందరయ్య భవన్ లో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి యస్ రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ను ఉద్దేశించి వారు మాట్లాడారు. ఢిల్లీ ఎర్రకోట నుండి ఆగస్టు 15న దేశ ప్రధాని నరేంద్ర మోడీ మాటల శబ్దం ఆగక ముందే కేంద్ర ఆర్థిక శాఖ రైతుల పై భారాలు వేసే ప్రయత్నం చేసిందని, ఈ మేరకు పత్తిపై దిగుమతి సుఖం తగ్గిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలో బాగా పత్తి పండించేది కర్నూలు జిల్లా అని, బాగా నష్టపోయే జిల్లా కూడా కర్నూలే అని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాల నుండి దిగుమతయ్యే పత్తిమీద ఉన్న 11% సుంఖాన్ని రద్దు చేయడం ద్వారా ఇబ్బడి ముబ్బడిగా పత్తి దిగుమతి అయి, దేశంలో ఉన్న పత్తి రైతులను నాశనం చేస్తుందన్నారు. రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర రాష్ట్ర పాలకులే కారణమన్నారు. కేంద్రం బడ్జెట్లో ఎరువుల ధరల మీద సబ్సిడీ తగ్గించిందని, దీనివల్ల సబ్సిడీ మీద పెట్టే నిధులు తగ్గిపోతాయన్నారు. కేంద్రం ఇచ్చే గ్రాంట్ కు ఆశపడి రాష్ట్రం ప్రకృతి వ్యవసాయం పేరుతో ఎరువులు వాడకండి అంటుందని, వాడకండి అంటే వినరు కాబట్టి ఎరువులే లేకుండా చేసే ప్రయత్నం చేస్తుందని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనేకచోట్ల రైతుల చేతుల్లో ఉన్న వందల ఎకరాల సాగు భూమిని వివిధ కారణాలు చెప్పి, పరిశ్రమల పేరుతో కార్పొరేట్ కంపెనీలకు ధారా దత్తం చేస్తుందన్నారు. గతంలో జగన్మోహన్ రెడ్డి అవినీతి అంటూ కేకలు పెట్టిన పాలకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత దేన్నయితే అవినీతి అన్నారో దాన్నే అత్యంత వేగంగా అమలు చేస్తున్నారన్నారు. నెల్లూరు జిల్లా కరేడులో 16 వేల జనాభా, 18 గ్రామాలు, 11 వేల ఎకరాల భూమి ఉంటే భూమి నంత ఒక్క శిరిడి సాయి కంపెనీకి అప్పజెప్పారన్నారు. రైతులంతా భూములు కాపాడుకోవడం కోసం పోరాడుతుంటే నిర్బంధాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగిస్తుందన్నారు. రైతులందరికీ యూరియా సరఫరా కోసం, గిట్టుబాటు, దిగుమతి సుంకాల ఎత్తివేత, రైతుల భూములు లాక్కోవడానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నిర్మల, ఎండి ఆనంద్ బాబు, జి రామకృష్ణ, కె వెంకటేశ్వర్లు, కె.వి నారాయణ, టి రాముడు, ఎండి అంజిబాబు, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, కె అరుణ, ఎం రాజశేఖర్, విజయ్, లింగన్న, లక్ష్మన్న, నగేష్, గురు శేఖర్, నరసింహ, వీరశేఖర్, హనుమంతు, గోవిందు, మోహన్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా ముగిసిన పోలీసు కానిస్టేబుళ్ల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

మనగళం, కర్నూలు క్రైం : ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ఉద్యోగానికి జరిగిన వివిధ పరీక్షల యందు ఉత్తీర్ణత పొంది కానిస్టేబుల్ ఉద్యోగాలు (సివిల్ మరియు ఏపీఎస్పీ) సాధించిన అభ్యర్థులందరికీ జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో సోమవారం సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థులకు, మంగళవారం ఏపీఎస్పీ కానిస్టేబుల్ అభ్యర్థులకు సజావుగా సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసిందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. కానిస్టేబుల్ ఉద్యోగాల వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామన్నారు. అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలన్నింటినీ డీపీఓ సిబ్బంది సమగ్రంగా పరిశీలించారన్నారు. ఈ వెరిఫికేషన్ ప్రక్రియ కోసం జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో మొత్తం 12 కౌంటర్లు ఏర్పాటు చేశారన్నారు. అభ్యర్థుల విద్యార్హతలు, క్రీడా సర్టిఫికేట్లు, కేటగిరీకి సంబంధించిన ధ్రువపత్రాలు సహా అన్ని అవసరమైన పత్రాలను సక్రమంగా పరిశీలించారన్నారు. సివిల్ , ఏపీఎస్పీ విభాగాలకు ఎంపికైన మొత్తం 643 మంది అభ్యర్థులు వెరిఫికేషన్ ప్రక్రియకు హాజరవ్వాల్సి ఉండగా 617 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 26 మంది అభ్యర్థులు ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు హాజరు కాలేదు. సివిల్ కానిస్టేబుల్స్ 309 మంది గానూ మొత్తం 298 హాజరయ్యారు. ఏపీఎస్పీ 334 మందికి గానూ 319 మంది అభ్యర్థులు హాజరు అయ్యారు. ఈ ధృవీకరణ పత్రాల పరిశీన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్ లు , డీపీఓ ఏఓ విజయలక్ష్మి, ఆర్ ఐ లు జావేద్, సోమశేఖర్ నాయక్ , డీపీఓ సూపరింటెండ్ లు, సిబ్బంది పాల్గొన్నారు.



## నాతోపాటుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నరేష్




మనగళం, కర్నూలు సిటీ: కర్నూలు నగరం పాతబస్టాండ్ లాల్ బహుదూర్ శాస్త్రినగర్ నివాసి నరేష్ మరణం విచారకరమని బీజేపీ నాయకుడు వేల్పుల గోపాల్ సంతాపం తెలిపారు. భారతీయ జనతా పార్టీ నుంచి తాను కోడుమూరు అసెంబ్లీ నుంచి 2009 ఎమ్మెల్యేగా పోటీ చేసిన తరుణంలో నా వెంట నడిచారని గుర్తు చేశారు. నాతో పాటు గ్రామ గ్రామాన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారన్నారు. భారతీయమజ్దూర్ సంఘ్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు తాను బాధ్యతలను నిర్వహిస్తున్న సందర్భంలోనూ నరేష్ నావెంటే ఉన్నారని గుర్తు చేశారు. లాల్ బహుదూర్ శాస్త్రినగర్ లో భారతీయమజ్దూర్ సంఘ్ 2008 సంవత్సరం నాటి జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో నరేష్ పాల్గొన్న విషయాన్ని ఈ సందర్భంగా వేల్పుల గోపాల్ గుర్తు చేశారు.

## రౌడీ షీటర్ బోయ తోట శివకు జీవిత ఖైదు



మనగళం, కర్నూలు క్రైం : హత్యకు సంబంధించి నేరం ఋజువు కావడంతో కర్నూలు జిల్లా, ఓర్వకల్లు పోలీసు స్టేషన్ పరిధిలో నన్నూరు గ్రామం నివాసి రౌడీ షీటర్ బోయ తోట శివకు జీవిత ఖైదుతోపాటు రూ. 5వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి తీర్పు చెప్పారు. రౌడీ షీటర్ బోయ తోట శివ 19.11.2017 వ తేదీన సాయంత్రం సుమారు 7.30 గంటలకు జామియా మసీదు వద్ద టీ హెూటల్ లో ఉన్న అజంఖాన్ సలాంబాషాపై వ్యక్తిగత కక్షతో కత్తితో దాడి చేసి , దారుణంగా పొడిచి హత్య చేయడం జరిగింది. హతుడు అజంఖాన్ సలాం బాషా అన్న అజం ఖాన్ శాలి బాషా ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ, ప్రస్తుత కర్నూల్ రూరల్ సీఐ యం.చంద్ర బాబు నాయుడు కేసు నమోదు చేశారు. అప్పటి ఇన్స్పెక్టర్లు శ్రీనివాసులు, మహేశ్వర రెడ్డి, నాగరాజు యాదవ్ లు కేసు విచారణ చేసి సదరు రౌడీ షీటర్ బోయ తోట శివ పైన చార్జ్ షీట్ వేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వెంకటరామిరెడ్డి ప్రాసిక్యూషన్ తరుపున వాధించారు. ఈ మేరకు నేరం రుజువు కావడంతో జడ్జి శిక్ష విధించారు. శిక్ష పడటంలో కీలకంగా వ్యవహరించిన కర్నూలు డీస్పీ జె.బాబుప్రసాద్, కర్నూలు రూరల్ సి.ఐ. చంద్రబాబు నాయుడు, ఓర్వకల్లు యస్.ఐ. సునీల్ కుమార్, పీసీ మద్దిలేటి, హెచ్ సీ నాగరాజు, హెచ్ సీ శివ ప్రసాద్ రెడ్డిని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

## శ్రీరాముని జీవితం మానవాళికి ఆదర్శం




మనగళం, తుగ్గలి : శ్రీరాముని జీవితం మానవాళికి ఆదర్శమని, ఎలా జీవించాలి, ఎలా జీవించకూడదో శ్రీమద్రామాయణం తెలుపుతుందని, అందుకే అందరూ శ్రీమద్రామాయణాన్ని చదివితే దేశానికి, ధర్మానికి సేవచేసినవారవుతారని తెలుగు పండితులు ధార్మికోపన్యాసకులు బి. రాజా జయచంద్రన్ అన్నారు. తుగ్గలి మండలం, కొత్తపల్లి గుడిసెల గ్రామంలోని శ్రీ కోదండ రామాలయం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన ధార్మిక కార్యక్రమంలో మొదటిరోజు శ్రీమద్రామాయణంపై ప్రవచించారు. ఈ కార్యక్రమాలు శనివారం వరకు కొత్తపల్లి గుడిసెల గ్రామంలోని శ్రీ కోదండరామాలయం నందు ప్రతిరోజు ధార్మిక ప్రవచనంతోపాటు స్థానిక భజన మండలిచే భజనలు, ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు కొమ్ము వెంకటేశ్వర్లు, ధర్మ ప్రచార మండలి సభ్యులు ఎ. కోదండరాముడు, మాజీ స్థానిక భజన మండలి సభ్యులతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్త్రీశక్తి పథకంపై మహిళలతో భారీ ర్యాలీ ఎమ్మెల్యే కోట్ల



మన గళండోన్ ఎల్లుండి జరగబోయే సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమం లో భాగంగా, స్త్రీ శక్తి పథకం పై మహిళలతో ర్యాలీ నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా మండల, పట్టణ నాయకులు మరియు కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, స్త్రీ శక్తి పథకం మహిళల సాధికారతకు బలమైన వేదికగా నిలుస్తుందని అన్నారు. ర్యాలీని మరియు సభ ను జయప్రదం చేయాలని అందరూ కృషి చేసి, మహిళా శక్తిని సమాజ అభివృద్ధికి దోహదం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చక్కని అవకాశాలు




- వర్కింగ్ క్యాపిటల్ తో యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం
- సులభతర ప్రభుత్వ అనుమతులకు త్వరితగతిన చర్యలు
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మనగళం, నంద్యాల: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పై యువ పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చేయూతను ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం యువ పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటుందన్నారు. పరిశ్రమల స్థాపనకు అవసరమయ్యే పెట్టుబడి సాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. అదేవిధంగా సులభతరంగా పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం హార్టికల్చర్, పసుపు, సుగంధ ద్రవ్యాలు, పూలు, పండ్ల మొక్కల పెంపకం ఎక్కువ శాతం చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో సుమారుగా 33 శాతం అటవీ ప్రాంతం ఉండగా, 1/3 వంతూ సాగు భూమి ఉండగా, అందులో ఎక్కువ శాతం వరి, జొన్న తదితర పంటలను సాగు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నంద్యాల సోనా బియ్యాన్ని సరఫరా చేయడం జరుగుతోందన్నారు. అదే విధంగా పశు సంపద కూడా జిల్లాలో సమృద్ధిగా ఉందన్నారు. జిల్లాలోని బనగానపల్లె, డోన్ ప్రాంతాల్లో 90 శాతం సున్నపు రాయి పరిశ్రమలతో పాటు 10 శాతం ఇనుప ఖనిజం లవణాలు ఉండడం వల్ల మైనింగ్ కార్యకలాపాలు నిర్వహణకు పెద్ద ఎత్తున అవకాశాలు ఉంటాయన్నారు. స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి పెరుగుదలకు వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల ద్వారా 42 శాతం, సేవా రంగాలకు 39 శాతం, పరిశ్రమల పరంగా 19 శాతం ద్వారా సేవలు అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి ఉత్సాహవంతులైన పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు. సదరు సంస్థల ఏర్పాటుకు బ్యాంకర్స్ వైపు నుండి కూడా పూర్తి సహకారం అందించడం జరుగుతుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం ఎస్.మహబూబ్ బాషా, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, కార్మిక శాఖ సహాయక కమిషనర్ బషీరునిస్సా బేగం, కాలుష్య నియంత్రణ సంస్థ ఈఈ కిషోర్ రెడ్డి, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలే... ఎస్సై రాజారెడ్డి



మన గళం అవుకు : అవుకు పట్టణ మరియు మండలంలో వినాయక చవితి, నిమర్జనం కార్యక్రమాలలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానని అవుకు పట్టణ ఎస్ఐ రాజారెడ్డి మంగళవారం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై రాజారెడ్డి మాట్లాడుతూ మండపాల వద్ద అధిక సౌండ్ ను పెట్టవద్దని, రాత్రి పది తర్వాత ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా వ్యవహరించకూడదని, మీకు ఎటువంటి సమస్య వాటిల్లిన తమ దృష్టికి తీసుకురావాల్సిందిగా తెలిపారు. ఎటువంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అవుకు పట్టణంలోని వినాయకులను శనివారం రోజున నిమజ్జనం, మండలంలో నెలకొల్పిన వినాయకులను శుక్రవారం నిమజ్జనం చేయవలసిందిగా కోరారు. ఈ నిమర్జన కార్యక్రమాలలో డిజె లు ఉపయోగించకూడదు, వీలైనంత త్వరగా చీకటి పడి లోపు నిమర్జనం కార్యక్రమాన్ని ముగించుకోవడం ఉత్తమమని, నిమర్జనం కార్యక్రమానికి చిన్న పిల్లలను దూరంగా ఉంచడం చాలా శ్రేయస్సు అని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మల్లికార్జున, ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీనివాసులు, విద్యుత్ శాఖ ఏఈ పకీరయ్య , గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి- సీఐ చంద్రబాబు





మనగలం :సున్నిపెంట : భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుపుకోవాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రబాబు మంగళవారం నాడు అన్నారు. సున్నిపెంట రెడ్ల కళ్యాణ మండపం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో మండల తాసిల్దార్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈ గణేష్ ఉత్సవాన్ని అన్ని మతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. ఉత్సవాల దగ్గర ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ వేడుకలు జరుపుకోవాలని, ఉత్సవ ఆర్గనైజర్లు ఐదు రోజులపాటు 24 గంటలు పూర్తి బాధ్యత వహించాలని సూచించారు. విగ్రహాల వద్ద నిర్లక్ష్యం వహించిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 31వ తేదీన ఆదివారం నాడు సాయంత్రం 7:00 గంటల వరకు నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం వేళల్లో రెండు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగింది అని కావున పోలీసులకు సహకరించి ఈ కార్యక్రమాన్ని కలిసికట్టుగా విజయవంతం చేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చిన్నపిల్లలను వృద్ధులను నిమజ్జనం వద్దకు తీసుకు వెళ్ళకూడదు స్థానిక ప్రజలకు సిఐ తగు సూచనలు చేశారు.

# రహదారి విస్తరణకు ప్రభావితులు సహకరించాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ బి. నవ్య



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగర పరిధిలో దామోదరం సంజీవయ్య కూడలి నుండి కెవిఆర్ గార్డెన్స్ వరకు రహదారి విస్తరణలో ప్రభావితమయ్యే ఆస్తి యజమానులు నగరాభివృద్ధికి సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య పిలుపునిచ్చారు. మంగళవారం చెక్‌పోస్ట్ సమీపంలోని దేవి ఫంక్షన్ హాల్లో 82 మంది ప్రభావిత ఆస్తి యజమానులతో కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. నగరానికి భవిష్యత్ రవాణా సౌకర్యాలు మెరుగుపడటానికి రహదారి విస్తరణ అత్యవసరమని, త్వరితగతిన పనులు ప్రారంభించాలని ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎవరూ నష్టపోకుండా, ఆస్తులు కోల్పోతున్న వారికి టిడిఆర్ బాండ్ల రూపంలో, భవనాలకు నగదు రూపంలో తగిన పరిహారం అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కొందరికి బాండ్లు అందజేశామని, త్వరలో మిగిలిన వారికి కూడా ఇస్తామన్నారు. మెరుగైన రవాణాకు, ట్రాఫిక్ నియంత్రణకు నగరాభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ మాట్లాడుతూ.. ప్రభావితుల్లో ఇప్పటికే ముగ్గురు బాధితులకు టిడిఆర్ బాండ్లు అందజేశామని, మరో 47 మందికి త్వరలో పంపిణీ చేసే ప్రక్రియ జరుగుతుందన్నారు. ఒకేసారి ప్రభావితులందరూ సహకరిస్తే పరిహారం పంపిణీ త్వరగా పూర్తి చేసి, పనులను త్వరగా ప్రారంభించవచ్చని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిసిపి వెంకట రమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలక్ష్మీ విద్యాసంస్థల చైర్మన్ దీక్షిత్ కు సన్మానం




మనగళం, కర్నూలు సిటీ : హౌస్ ఆఫ్ లార్డ్స్ బ్రిటిష్ పార్లమెంట్ యునైటెడ్ కింగ్డమ్ నందు వరల్డ్ స్కూల్స్ సమ్మిట్-2025 నుండి ది ఇన్నోవేటర్ ఇన్ ఎడ్యుకేషన్ క్యాటగిరిలో ఇండియా నుండి ఎంపికై బ్రిటిష్ పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్ సభ్యులు లార్డ్ డానియల్ బ్రెనన్ నుండి అవార్డును అందుకుని భారతదేశానికి చేరుకున్న శ్రీలక్ష్మీ విద్యాసంస్థల చైర్మన్ పీ.దీక్షిత్ కు బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు. రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మదాసికురువ సంకన్న, జిల్లా అద్యక్షులు అశోక్ తదితరులు స్థానిక శ్రీలక్ష్మీ విద్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్ మాట్లాడుతూ కర్నూలు నుండి ఈ అవార్డును అందుకోవడం గొప్పవిషయమన్నారు. భవిష్యత్తులో శ్రీలక్ష్మీ విద్యాసంస్థల చైర్మన్ పీ.దీక్షిత్ విద్యార్థులను అన్నిరంగాలలో ఉత్తమ ఫలితాలను సాధించేల తీర్చిదిద్ది విద్యాసంస్థను మరింత గొప్పగా తీర్చిదిద్దగలరని పేర్కొన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గొప్ప అవార్డులను సైతం సొంతం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్వేపల్లి విద్యాసంస్థల అధినేత పీ. శేషన్న,నాయకులు మదాసికురువ భరత్ కుమార్, రాము, మహేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కోడుమూరు పట్టణంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో డోన్ రోడ్ లో గల మార్కెట్ యార్డ్ లో మంగళవారం ఉదయం 11 గంటలకు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమం మార్కెట్ యార్డ్ సెక్రెటరీ సుందర్ రాజు ఆధ్వర్యంలో జరిగింది ఈ సందర్భంగా ఆకే పోగు సుగుణమ్మ వైఫ్ ఆఫ్ ఆకే పోగు జయన్న మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవికి ప్రమాణ స్వీకారం చేశారు మరియు బోయ పొట్టనగిరి ఎల్లప్ప నాయుడు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేశారు అలాగే మిగిలిన 14 మంది సభ్యులు కూడా ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడుమూరు మార్కెట్ యార్డ్ కమిటీకి మొదటి పాలకవర్గాన్ని ఏర్పాటు చేయడమైనది ఈ కమిటీ ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్యే దస్తగిరిని మరియు కేడిసి చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు ఈ ఇరువురి సహకారంతో కర్నూల్ మార్కెట్ యార్డ్ కమిటీ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈరోజు మొట్టమొదటి మార్కెట్ యార్డ్ కమిటీ పాలకవర్గ కమిటీని ఏర్పాటు చేసుకుంది ఈ మార్కెట్ యార్డ్ మొత్తము 15 ఎకరాలు ఉంది పాలకమండలి ద్వారా ఈ మార్కెట్ ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి రైతులందరికీ ఉపయోగపడేలా చేయాలని సదుద్దేశంతో కూటమి ప్రభుత్వము ఈ కమిటీని ఏర్పాటు చేసిందని త్వరలోనే ఇది రెగ్యులేషన్ మార్కెట్ గా అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి గంగాధరు గోరంట్ల సర్పంచ్ బాలకృష్ణ అయ్యప్ప వెంకటగిరి రాజు లద్దగిరి పట్టే కృష్ణ పులకుర్తి త్రివేద్ మరియు జనసేన పార్టీ నాయకులు ఆకే పోగు రాంబాబు తదితర నాయకులు మరియు మార్కెట్ యార్డ్ అధికారులు స్థానిక ప్రజలు విరివిగా పాల్గొన్నారు

# యూరియా70 టన్నులు కాదు 67.970 టన్నులుమాత్రమే వచ్చినది

మన గళండోన్ గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ గారి దివ్య సముఖమునకు తెలియజయడమేమనగా డోన్ మండలంలోని డి.సి.ఎంఎస్ రిటైల్ అవుట్లెట్ కి 15.07.2025 తారీఖున 19,980 టన్నులు,18.07.2025 వ తారీఖున 11.970 5,24.07.2025 5 11.970 ,01.08.2025 2 ? 23.940 ?? మొత్తంగా 67.86 టన్నుల యూరియా మార్ఫెడ్ ద్వారా సరఫరా చేయడం జరిగింది.24.08.2025 తారీఖున గౌరవ కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ నుండి ఏ.వో గారు, పోలీసు శాఖ నుండి ఎస్.ఐ గారు, మరియు రెవెన్యూ శాఖ నుండి ఆర్.ఐ డోన్ గారు డి.సి. ఎంఎస్ గోడౌన్ తనిఖీ చేయడం జరిగింది. గోడౌన్లో గ్రౌండ్ బ్యాలెన్స్ %చీ×ూ% చూపించడం జరిగింది. ఈపాస్ మిషన్లో కూడా బ్యాలెన్స్ %చీ×ూ% చూపించడం జరిగింది. అయితే పోలీసు శాఖ వారు ఎంత స్టాకు వచ్చింది...? ఎవరికి అమ్మారు..? వివరాలు పూర్తిగా కావాలని అడిగారు. అప్పుడు డి.సి.ఎం.ఎస్ ఇంచార్జ్ డోన్ మాన్యువల్ గా చేసిన బిల్స్ పోలీసు శాఖ వారికి చూపించడం జరిగింది. అయితే ఆ బిల్లులో రైతులు పూర్తి వివరాలు ఫోన్ నెంబర్ తో సహా కావాలని అడిగారు. ఆ వివరాలు డి.సి.ఎం.ఎస్ ఇన్చార్జి దగ్గర లేని కారణంగా ఇవ్వలేకపోయారు.కానీ వాస్తవముగా డోన్ మండలములో సాగు విస్తీర్ణం 54634 వేల ఎకరాలు ఉన్నది. వ్యవసాయ శాఖ ఏ.వో వారు డోన్ మండలంలో రైతు సేవా కేంద్రం(%=ాఖ%) సిబ్బంది ట్రాన్స్ఫర్ కారణంగా మరియు %ూాజూ% ఆక్టివ్ గా లేని కారణంగా మొత్తం ఎరువులను యూరియా ఎరువులను డి.సి.ఎం.ఎస్ కి ఇండెంట్ పెట్టి తెప్పించడం జరిగింది. అయితే నాలుగు విడతలలో ఎరువులు రావడం వలన రైతులు ఎక్కువ సంఖ్యలో ఒకటేసారి వచ్చి కౌంటర్ కి చేరడం వలన మాన్యువల్ గా రైతు పూర్తి వివరాలు తీసుకోకుండా సేల్ చేయడం జరిగింది. తరువాత ఈ పాస్ సేల్స్ చేయడం జరిగింది. ఈపాస్ సేల్స్ ఐఎఫ్ఎస్సి %×ఖీమీ% లో 130 మంది రైతులు మాత్రమే ఉన్నారు. ఈ పాస్ సిల్స్ చేసేటప్పుడు వచ్చిన రైతుల పేరు మీద ఆ రైతు ఐదు బస్తాలు తీసుకొని ఉంటే 15 బస్తాలు చొప్పున ఇవ్వడం జరిగింది. కాబట్టి ఈ పాస్ సిల్స్ మరియు మాన్యువల్ సేల్స్ లో భేదము కనిపిస్తూ ఉన్నది. వాస్తవముగా 306 మంది రైతులకి యూరియాను ఒక్కొక్క రైతుకి మూడు నుండి నాలుగు బస్తాలు ఇవ్వడం జరిగింది. అట్టి యూరియా రైతులకు మాత్రమే చేరి ఉంది.ఎటువంటి దుర్వినియోగం జరగలేదు. అయినను డి.సి.ఎం.ఎస్ మాన్యువల్ బిల్ వివరాలు మరియు ఐ.ఎఫ్.ఎం.ఎస్ వివరాలు రెండిటి ఆధారంగా గ్రామంలోని రైతుల దగ్గరికి వెళ్లి ఫీల్డ్ ఎంక్వయిరీ చేసి తమరికి పూర్తి వివరాలు సమర్పించగలము. ఈ విషయమై వ్యవసాయ అధికారి డోన్ కలెక్టర్ గారికి వివరణ సమర్పించడం జరిగింది.

# వినాయక ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దు

**– ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్**

మనగళం, ఆత్మకూరు : నంద్యాల జిల్లా ఆత్మకూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ఎలాంటి అవాంచనీయ ఘటనలకు తావులేకుండా భక్తిశ్రద్దలతో జరుపుకోవాలని డీఎస్పీ రామాంజి నాయక్ సూచించారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షులు సేగు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణి కార్యక్రమంలో కాకనూరు పీఠాధిపతి యోగేంద్ర సరస్వతి స్వామీజితేపాటు డీఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, విగ్రహ మండపాల వద్ద ఉత్సవ కమిటీలు ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోనాలని సూచించారు. పోలీసుల నియమాలను ప్రతిఒక్కరూ విధిగా పాటించాలన్నారు. పట్టణంలో తమ సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ప్రతిరోజు వినాయక విగ్రహ మండపాల పరిధుల్లో శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘాతోపాటు పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తామన్నారు. విగ్రహ మండపాల వద్ద రాత్రివేళ అయిదు మంది చొప్పున ఉత్సవ కమిటీ సభ్యులు ఉండాలన్నారు. ఉత్సవ రోజులు ముగిశాక నిమజ్జన కార్యక్రమంలో భాగంగా వినాయక విగ్రహాల తరలింపులో ఎలాంటి అవాంచనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. నిమజ్జన ఘాట్ వద్దకు చిన్నపిల్లలను పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# కోడుమూరు మండల కేంద్రంలో చనుగొండ్ల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండల కేంద్రంలో చనుగొండ్ల రోడ్డులో ఉన్నటువంటి రైతుల పంట పొలాలను కోడుమూరు మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ తో పాటు నంద్యాల ఆర్ ఎ ఆర్ ఎస్ రీజినల్ రీసెర్చ్ సెంటర్ నుంచి బాలాజీ నాయక్, మోహన్ విష్ణువర్ధన్, చైతన్య మేడం సైంటిస్టులు ఆగస్టు నెలలో కురిసినటువంటి వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి పత్తిలో తీసుకోవలసిన జాగ్రత్తలను ఈ సందర్భంగా రైతులకు తెలియజేశారు చనుగొండ్ల రోడ్ లో ఉన్నటువంటి తిరుమలయ్య పొలంలో మరియు ప్రభాకర్ రెడ్డి పొలంలో పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు రైతులందరికీ తగిన సలహాలు ఇచ్చారు మొదటగా ప్రతిలో అంతర సేద్యం చేసి రసాయనిక ఎరువులను వేయవలసిందిగా సూచించడం జరిగినది ప్రతిలో పై పాటుగా ఎకరాకు 20 కేజీల యూరియా 15 కేజీల కొటేషన్ వేసుకోవాల్సిందిగా ఈ సందర్భంగా వారు రైతులకు తెలియజేశారు ఇందులో భాగంగా యూరియా అందుబాటులో లేకపోతే నానో యూరియాని 500 ఎంఎల్ ఎకరాకు స్ప్రే చేసుకోవలసిందిగా వారు తెలియజేశారు దీంతోపాటుగా 13.0.45 మందును మొక్కలు బాగా తడిచేటట్టు ఎకరాకు కేజీ చొప్పున స్ప్రే చేసుకొని ప్రతిలో రసం పీల్చే పురుగుల నివారణ కొరకు ఫిప్రోనిల్ 2 %ఎశ్రీ% ఒక లీటర్ నీటికి లేదా



అస్సిపేట్ 1.5 గ్రామ్ లీటర్ నీటికి కలిపి స్ప్రే చేసుకున్న ఎడల రసం పీల్చే పురుగుల ఉధృతి నివారించవచ్చని వారు ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులతో పాటు స్థానిక రైతులు పాల్గొని వారి అమూల్యమైన సలహాలను కచ్చితంగా పాటిస్తామని అధికారులకు రైతులందరూ తెలియజేశారు

# ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక కృషి

**– సిటీ స్కాన్ ను ప్రారంభించిన మంత్రి టి.జి.భరత్**

మనగళం, కర్నూలు సిటీ : ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అన్ని కార్పొరేట్ సౌకర్యాలు కల్పించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామని పరిశ్రమలు,వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి. భరత్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రూ. 6.74 కోట్ల విలువగల 128 స్లైస్ డబుల్ సిటీ స్కానింగ్ మిషన్ ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి టి.జి. భరత్ మాట్లాడుతూ... మొదటినుంచి నా ధ్యేయం నియోజకవర్గ అభివృద్ధి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి అని తెలుపుతూ ఉంటానని గుర్తు చేశారు. అందులో భాగంగా కర్నూలు సర్వజన ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయికి తీసుకుని వెళ్లేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నానని తెలియజేశారు. ఇప్పుడు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా 6.74 కోట్ల రూపాయల విలువైన 128 స్లైస్ డబల్ సి టి స్కాన్ ను ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. ఇటువంటి సేవలు కేవలం హైదరాబాదు, బొంబాయి వంటి మహా నగరాలలోనే అందుబాటులో ఉందని తెలిపారు. లక్షల సంఖ్యలో వైద్యం కోసం వచ్చే ఆసుపత్రులను నడపడం అంత సులభం కాదని, ఇక్కడ ఉన్న డాక్టర్లు, సిబ్బంది బాగా కృషి చేస్తున్నారని మంత్రి అభినందించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి సౌకర్యాలు కల్పించడంలోనూ, భవనాలు నిర్మించడంలోనూ, క్రొత్త పరికరాలు తీసుకుని రావడంలోనూ నేను ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటానని మంత్రి తెలియజేశారు. రాష్ట్రమంతటా ప్రభుత్వ ఆసుపత్రులకు ఆక్సిజన్ సరఫరా 38 రూపాయలు క్యూబిక్ మీటర్ చొప్పున సరఫరా చేస్తున్నారని, అదే విధంగా కర్నూలు జనరల్ ఆసుపత్రికి కూడా సరఫరా చేస్తున్నారని ఈ విషయంపై నేను ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. నా సొంత ఆసుపత్రికి కేవలం 12 రూపాయలు చొప్పున ఆక్సిజన్ సరఫరా జరుగుతున్నదని తెలిపారు. వెంటనే కాంట్రాక్ట్ రద్దు చేయటము లేదా సరఫరా ధరను తగ్గించడం జరిగే లాగా ప్రభుత్వ ధనము పొదుపు చేసేలాగా కృషి చేస్తున్నామని తెలిపారు. కోట్ల రూపాయల ధనము



అధికంగా చెల్లించడం మంచిది కాదని తెలిపారు. ప్రజల కొరకు ఇంత మంచి ఉపకరణాన్ని అందించిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థకు మంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ... ఈ సిటీ స్కానింగ్ వలన మన రాష్ట్రంలోని ఏడు జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఇతర సీటి స్కానింగ్ లలో రోగి దాదాపు అరగంట సమయం వెచ్చించే అవసరం ఉంటుందని, దీని ద్వారా కేవలం ఐదు నిమిషాలలో మంచి క్వాలిటీతో పరీక్ష పూర్తవుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డీజీఎం శ్రీనివాసమూర్తి, పి. ఆర్.ఓ శ్రీకాంత్ ఈ స్కానింగ్ మిషన్ యొక్క విశిష్టతలను తెలియజేశారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# స్టేట్ కోట ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం



మనగళం, కర్నూలు సిటీ : 2025-26 సంవత్సరానికి స్టేట్ కోటా కింద ఎంబీబీఎస్ మొదటి సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం 68 మంది విద్యార్థులు కర్నూలు మెడికల్ కాలేజ్ లో అడ్మిషన్ తీసుకున్నారని చెప్పారు. ఈనెల 29 తేదీ వరకు ఫస్ట్ ఫేస్ అడ్మిషన్లకు అవకాశం ఉందని ఆమె తెలిపారు.

# జామ, ఉసిరి ఏది మేలు చేస్తుంది?



మనగళం, అన్ని కాలాల్లో ఆరోగ్యంగా ఉండాలంటే సీజనల్ పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా తీసుకోవాలి. ముఖ్యంగా చలికాలంలో రోగాలు ఎక్కువగా దాడి చేస్తాయి. ఇలా జరగకుండా ఉండాలంటే ఈ కాలంలో వచ్చే పండ్లు ఆహారంలో తప్పని సరిగా తీసుకోవాలి. ముఖ్యంగా జామ, ఉసిరి వీటిని ఆహారంలో భాగంగా తీసుకుంటే ఎన్నో ఆరోగ్య సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. చలికాలంలో కొన్ని రకాల ఆహారాలు తప్పనిసరిగా తినడం ఆరోగ్యానికి చాలా అవసరం. అటువంటి వాటిల్లో జామ, ఉసిరి ముందు వరుసలో ఉంటాయి. వీటిల్లో అనేక రకాల పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రెండూ సూపర్ ఫుడ్స్. పురాతన కాలం నుంచి వివిధ ఆరోగ్య సమస్యలను నయం చేయడానికి వీటిని ఉపయోగిస్తున్నారు. అయితే వీటిలో ఒకటి ఎంచుకోవలసి వస్తే, ఏది ఆరోగ్యకరమైనది అనే సందేహం కలుగుతుంది. జామలో విటమిన్ సి, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఉసిరిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. అంతేకాకుండా ఉసిరిలో ఐరన్, కాల్షియం, టానిన్లు, ఫ్లేవనాయిడ్స్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి ఉపయోగపడతాయి. ఇవి రెండింటిలోనూ విటమిన్ సి కంటెంట్ అధికంగా ఉంటుంది. అయితే అధిక యాంటీఆక్సిడెంట్ స్థాయిల కారణంగా జామను ఎక్కువగా తీసుకోమని నిపుణులు చెబుతుంటారు. జామ, ఉసిరి..ఇవి రెండూ రోగనిరోధక శక్తిని పెంచుతాయి. జామలో విటమిన్ సి ఎక్కువగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి కూడా ఎక్కువగా ఉంటుంది. ఇది కణాలను దెబ్బతినకుండా కాపాడుతుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఉసిరి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా సహజమైన నిర్విషీకరణగా కూడా పనిచేస్తుంది. ఇది టాక్సిన్స్‌ను బయటకు పంపడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఉసిరిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఆర్థరైటిస్, డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక సమస్యలను నియంత్రించడంలో సహాయపడతాయి. ఉసిరిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది సాధారణ జలుబు లక్షణాల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మొత్తం రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. జామల ఫైబర్ అధికంగా ఉండే పండు. ఇది జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. గట్‌లో ఆరోగ్యకరమైన మైక్రోబయోటాను నిర్వహించడానికి ఇది చాలా మంచిది. ఉసిరి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది ప్రేగు కదలికలను నియంత్రిస్తుంది. జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తికి సహాయపడుతుంది. ఉసిరిని అజీర్ణం, ఉబ్బరం చికిత్సకు ఆయుర్వేదంలో విస్తృతంగా ఉపయోగిస్తారు. జామలోని పీచు పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉసిరి జీర్ణవ్యవస్థను నియంత్రిస్తుంది. కాబట్టి ఈ రెండూ జీర్ణక్రియకు మంచి ఎంపిక.


# గుండె ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలి..?

మనగళం,చలికాలంలో హార్ట్ ఎటాక్ రిస్క్ అధికంగా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల రక్తనాళాలు కుదించుకొని రక్త సరఫరా సమస్యలు కలిగిస్తాయి. ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట వంటి లక్షణాలు హార్ట్ బ్లాకేజీకి సంకేతాలు. క్రమం తప్పకుండా హార్ట్ చెకప్ చేయించుకోవడం చాలా ముఖ్యం. చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గిపోవడం వల్ల గుండె సంబంధిత సమస్యలు పెరుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ రిపోర్ట్ ప్రకారం.. వీటిలో ప్రధానంగా హార్ట్ ఎటాక్ కేసులు అధికంగా నమోదవుతున్నాయట. చలికాలంలో శరీరం శీతల ఉష్ణోగ్రతలకు అలవాటు పడే ప్రక్రియలో, రక్తనాళాలు కుదించుకోవడం ప్రారంభిస్తాయి. ఈ పరిస్థితి రక్త సరఫరాను అడ్డుకుని హార్ట్ బ్లాకేజీకి దారి తీస్తుంది.హార్ట్ బ్లాకేజీ ముందే గుర్తించడానికి కొన్ని లక్షణాలు సహాయపడతాయి. ఛాతీ నొప్పి, ఛాతీపై ఒత్తిడి అనుభవించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటితో పాటు తేలికపాటి వ్యాయామం చేసినా శరీరం అలసిపోవడం, తలనొప్పి, మైకం వంటి సమస్యలు కూడా గమనించాల్సి ఉంటుంది. హార్ట్ బ్లాకేజీని నివారించడానికి జీవన విధానంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం, పొగత్రాగడం, మద్యం తాగడం వంటి అలవాట్లకు దూరంగా ఉండడం ముఖ్యం. పౌష్టిక ఆహారం తీసుకోవడం, రోజువారీ జీవన విధానంలో ఆరోగ్యకరమైన అలవాట్లను కలపడం ద్వారా రిస్క్ తగ్గించవచ్చు. హార్ట్ బ్లాకేజీ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యం. ఛాతీ నొప్పి సాధారణంగా గ్యాస్ సమస్య అని అనుకోకూడదు. నిర్లక్ష్యం చేస్తే హార్ట్ ఎటాక్ వచ్చే ప్రమాదం ఉంటుంది.

# మదర్ థెరిసా సేవలు మరువలేనివి

**– మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్**

మనగళం, కర్నూలు సిటీ : ఎక్కడో పుట్టి భారతదేశానికి వచ్చి దేశ ప్రజలకు మదర్ థెరిసా చేసినటువంటి సేవలు చిరాస్మరణీయమని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. మదర్ థెరిసా 116వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక ప్రకాష్ నగర్ లో ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి టీజీ వెంకటేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేకును రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మదర్ థెసాను స్ఫూర్తిగా తీసుకొని, ఇతరులకు సహాయం చేసి మానవత్వాన్ని చాటుకోవాలని సూచించారు. మదర్ థెరిసా స్ఫూర్తితో గత 20 సంవత్సరాలుగా అభయగిరిలో ఉన్న హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం కొరకు సేవలు చేస్తుండడం అభినందనీయమన్నారు. అభయగిరిలో సేవా కార్యక్రమాలు నిమిత్తం తమవంతుగా సహాయ సహకారాలు అందజేస్తున్నట్టు టీజీ వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ విద్యా సంస్థల డైరెక్టర్ దీక్షిత్, సురేంద్ర, డాన్సర్ రామకృష్ణ, అభయగిరి నిర్వహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కోడుమూరు పట్టణంలో శ్రీశ్రీశ్రీ వీరభద్రేశ్వరస్వామి వైభవంగా జరిగిన జయంతి వేడుకలు

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో గల మఠం జంగమ మహేశ్వరులు,వీరశైవులు,భక్తులు శ్రీ వీరభద్రేశ్వరస్వామి జయంతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కోడుమూరు వీరశైవ లింగాయతీ దైవాచార సంక్షేమ సంఘం సభ్యులు శెట్టి వీరప్ప,రంగాపురం బసన్న,ఆకుల నాగరాజు,డిష్ రవీ,ఎస్టి చంద్రశేఖర్,ఎస్టీ శ్రీకాంత్,నాగప్ప, పరమేష్ తదితరుల ఆధ్వర్యంలో శ్రీ వీరభద్రస్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ముందుగా పట్టణంలోని స్థానిక మెయిన్ బజారులో వెలసిన మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం,ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రేశ్వరస్వామి చిత్రపటాలతో వీరశైవులు ఊరేగింపుగా స్థానిక కోటవీధిలోని వీరభద్రస్వామి ఊరేగింపుగా వెళ్లారు.ఊరేగింపు సందర్భంగా ఆలయ అర్చకులు సంగాల మఠం శివయ్యస్వామి వీరభద్రుడి ఖడ్గాలు చదువుతూ,వీరశైవులందరూ ఓం నమశ్శివాయ..ఓం నమశ్శివాయ అంటూ స్థానిక మునుమంద వీధి, సాయిబాబా ఆలయం మీదుగా ఆలయానికి చేరుకున్నారు ఆలయంలో సంగాల శివయ్యస్వామి జంగం సర్వేశ్వరయ్యస్వామి వేదమంత్రోచ్ఛారణల మధ్య వీరభద్రుడి మూల విరాట్ కు మహా రుద్రాభిషేకం పంచద్రవ్యాభిషేకం, అష్టోత్తర శతనామావళి వంటి ప్రత్యేక పూజలను వీరశైవులు,భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా శివయ్యస్వామి వీరభద్రుడు అవతరించిన సందర్భాన్ని వివరిస్తూ ప్రతియేటా భాద్రపద మాసంలోని మొదటి మంగళవారం రోజున వీరశైవులందరూ స్వామి జయంతోత్సవ వేడుకలు జరుపుకుంటారన్నారు.దక్షుడు యజ్ఞము చేయిస్తుండగా ఆహ్వానం లేకపోయినా సతీదేవి అక్కడికి వెళ్లడం జరుగుతుందన్నారు. పిలవకపోయినా వచ్చిన సతీదేవిని చూసిన దక్షుడు అవమానించడం కారణంచే ఆమె ఆగ్రహంతో యజ్ఞంలో దూకడం జరుగుతుందని చెప్పారు.దీంతో అక్కడున్న శివభక్తులైన వీరశైవులు ఆక్షేపించడంతో దక్షుడు వారిపై దాడిచేయిస్తారన్నారు ఆ సమయంలోనే శివభక్తుల రక్షణార్ధం శివుడు తన జటాజూటళం నుండి ఉద్భవింపజేసిన రూపమే వీరభద్రుడని పేర్కొన్నారు. వీరభద్రుడు దక్షుని యాగమును భస్మీపటలం చేసి శివభక్తులను రక్షించడం జరుగుతుందని తెలియజేశారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో శెట్టి రామప్ప సిపిఐ కృష్ణ బి నాగప్ప,తిమ్మాపురం పరమేశ్వప్,బి నాగరాజు,ఆకుల ఆనంద్,ఎస్టి వినయ్,శెట్టి రవి,దీపక్,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.





# ఆసియా కప్‌లో టీమ్ఇండియానే ఫేవరెట్

మన గళం : ఆసియా కప్‌లో టీమ్ఇండియానే ఫేవరెట్ అని శ్రీలంక మాజీ క్రికెటర్ ఫర్వేజ్ మహరూఫ్ అంటున్నాడు. అదే సమయంలో టీ20ల్లో ఏమైనా జరగొచ్చని, శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు కూడా గెలిచే అవకాశం ఉందని అతడు చెబుతున్నాడు. ఇప్పటివరకు శ్రీలంక మొత్తం ఆరుసార్లు ఆసియా కప్‌ను సొంతం చేసుకుంది. అలాగే బంగ్లాదేశ్ 2012, 2016, 2018లో ఫైనల్స్‌కు చేరుకుంది. కానీ విజేతగా నిలవలేకపోయింది. 'టీమ్ఇండియానే ఆసియాకప్ టైటిల్ ఫేవరెట్. కానీ.. శ్రీలంక, బంగ్లాదేశ్‌లు అందరినీ విస్మయానికి గురిచేస్తూ గెలిచే అవకాశమూ ఉంది. టీమ్ఇండియా స్క్వాడ్ బలంగా ఉంది. కానీ ఇది టీ20 క్రికెట్. ఇక్కడ ఏదైనా జరగొచ్చు. ఎవరైనా ఛాంపియన్లుగా అవతరించొచ్చు' అని మహరూఫ్ ఓ ఇంటర్వ్యూలో అన్నాడు. అలాగే భారతజట్టు బలాల గురించి కూడా అతడు విశ్లేషించాడు. 'అన్ని ఫార్మాట్లలోనూ భారత్‌కు చాలామంది ఆటగాళ్లు ఉన్నారు. రోహిత్ శర్మ టీ20ల నుంచి రిటైర్ అయ్యాడు. అతడి స్థానాన్ని భర్తీ చేయడానికి చాలామంది క్రికెటర్లు ఉన్నారు. ముఖ్యంగా ఐపీఎల్ వల్ల టీమ్ఇండియాకు ఎంతో మేలు జరుగుతోంది' అని మహరూఫ్ అన్నాడు. యశస్వి జైస్వాల్ గురించి కూడా మహరూఫ్ మాట్లాడాడు. 'యశస్వి జైస్వాల్ బ్యాటింగ్‌ను నేను ఆస్వాదిస్తా. అతడో యువ క్రికెటర్. జైస్వాల్ ఎప్పుడైతే పెద్ద స్కోర్లు చేస్తాడో.. అప్పుడు కచ్చితంగా టీమ్ ఇండియా విజయం సాధిస్తుంది. కానీ దురదృష్టవశాత్తూ అతడు ప్రస్తుతం టీమ్ఇండియా స్క్వాడ్‌లో లేడు. అయినా జైస్వాల్ త్వరలోనే టీ20 జట్టులోనూ తన స్థానాన్ని సంపాదించుకుంటాడు' అని ఫర్వేజ్ మహరూఫ్ అన్నాడు. అలాగే జస్‌ప్రీత్ బుమ్రా గాయాల గురించి కూడా అతడు వివరించాడు. 'బుమ్రా బౌలింగ్ యాక్షన్ యూనిక్. అతడు గతానికి ఇప్పటికీ ఎంతో మెరుగయ్యాడు. బంతిని ఇన్‌స్వింగ్, అవుట్ స్వింగ్ కూడా చేయగలుగుతున్నాడు. ఇప్పుడు ఉన్న బౌలర్లలో ఎవరు అత్యంత కఠినమైన బౌలర్ అని బ్యాటర్లను అడిగితే.. వారితో 90 శాతం మంది బుమ్రానే అని చెబుతారు. అయితే దురదృష్టవశాత్తూ అతడు తరచూ గాయాలపాలవుతున్నాడు. అతడి వర్క్‌లోడ్‌ను బీసీసీఐ దృష్టిలోపెట్టుకొని జాగ్రత్తగా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఫాస్ట్ బౌలర్లు బంతిని సంధించిన ప్రతిసారీ తమ శరీర బరువుకు మూడురెట్ల భారాన్ని వారి వెన్ను, మోకాళ్లు, మడమల మీద మోపినట్లవుతుంది. అందుకే ఎక్కువగా గాయాలపాలయ్యే అవకాశం ఉంటుంది' అని మహరూఫ్ వివరించాడు. యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. మొదటి మ్యాచ్ అఫ్గానిస్థాన్, హాంకాంగ్‌ల మధ్య జరగనుంది. సెప్టెంబర్ 10న టీమ్ఇండియా, యూఏఈ తలపడనున్నాయి.



# వైయస్ జగన్ ను కలిసిన బుట్టా ప్రతుల్



మనగళం, కర్నూలు సిటీ : మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ను రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్ మంగళవారం తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. భేటీలో యువతకు తీసుకువచ్చే అవకాశాలు, నియోజకవర్గ అభివృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాలపై చర్చించినట్లు బుట్టా ప్రతుల్ తెలిపారు. వైయస్ జగన్ యువ నేతల సేవా శక్తిని ప్రశంసించి, ప్రజల సంక్షేమం కోసం మరింత కృషి చేయాలని సూచించారన్నారు.

# ఇంగ్లండ్ క్రికెట్ ప్లేయర్ జో రూట్‌పై సచిన్ ప్రశంసల వర్షం




మన గళం : భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన టెస్ట్ పరుగుల రికార్డుకు దగ్గరగా ఉన్న ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ పై ప్రశంసల వర్షం కురిపించారు. రూట్‌ను మొదటిసారి చూసినప్పుడే అతను భవిష్యత్తులో ఒక గొప్ప ఆటగాడు అవుతాడని తాను ఊహించినట్లు వెల్లడించాడు. ప్రస్తుతం సచిన్ 15,921 పరుగులతో టెస్ట్ చరిత్రలో అగ్రస్థానంలో ఉండగా, రూట్ ఇప్పటివరకు 13,543 పరుగులు సాధించి, ఆ రికార్డుకు చేరువ అవుతున్నాడు. సోషల్ మీడియా వేదిక రెడిట్‌లో అభిమానులతో ముచ్చటించిన సచిన్‌ను ఒక అభిమాని రూట్ గురించి ప్రశ్నించాడు. దీనికి స్పందిస్తూ, '2012లో నాగ్‌పూర్‌లో రూట్ అరంగేట్రం చేసినప్పుడు నేను తొలిసారి చూశాను. అప్పుడే నా సహచరులకు, 'ఇదే భవిష్యత్ ఇంగ్లండ్ కెప్టెన్' అని చెప్పాను' అని సచిన్ గుర్తుచేసుకున్నారు. వికెట్‌ను అంచనా వేసే తీరు, స్ట్రైక్ రొటేట్ చేసే నైపుణ్యం రూట్‌ను ప్రత్యేకంగా నిలబెట్టాయని సచిన్ వెల్లడించారు. ఆ క్షణంలోనే అతను చాలా పెద్ద ఆటగాడు అవుతాడని నాకు అర్థమైంది' అని సచిన్ వివరించాడు. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తన మాజీ సహచరుడు ఛటేశ్వర్ పుజారాను కూడా సచిన్ ప్రత్యేకంగా అభినందించారు. 'పుజారా, నువ్వు మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తుంటే జట్టులో అందరికీ ధైర్యం కలిగేది. నీ టెక్నిక్, ఓపిక, ఒత్తిడిలో నిలకడగా ఆడే తీరు జట్టుకు అమూల్యమైన బలం ఇచ్చాయి' అని ఆయన తెలిపారు.

# కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్లో మీరాబాయి చానుకు గోల్డ్



మన గళం :అహ్మదాబాద్‌లో జరుగుతున్న కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లలో భారత వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను స్వర్ణ పతకం గెలుచుకుని దేశానికి గర్వకారణంగా నిలిచారు. 48 కేజీల విభాగంలో పోటీపడిన ఆమె అద్భుతమైన ప్రదర్శన కనబరిచి ఈ ఘనత సాధించారు. తన ప్రతిభతో ఆమె అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ పోటీలో మీరాబాయి చాను మొత్తం 193 కేజీల బరువును ఎత్తి విజేతగా నిలిచారు. ఇందులో స్నాచ్ విభాగంలో 84 కేజీలు మరియు క్లీన్, జెర్క్ విభాగంలో 109 కేజీల బరువును అలవోకగా లిఫ్ట్ చేశారు. ఆమె ప్రదర్శన ప్రత్యర్థులకు అందనంత ఎత్తులో నిలిచింది. ఈ విజయంతో ఆమె భవిష్యత్తులో జరగబోయే అంతర్జాతీయ పోటీలకు ఒక బలమైన పోటీదారుగా నిరూపించుకున్నారు. ఈ విభాగంలో రజత పతకం మలేషియాకు చెందిన ఐరీన్ హెన్రీకి దక్కింది. ఆమె మొత్తం 161 కేజీల బరువును ఎత్తి ద్వితీయ స్థానంలో నిలిచారు. కాంస్య పతకాన్ని వేల్స్ క్రీడాకారిణి నికోల్ రాబర్ట్స్ దక్కించుకున్నారు. ఆమె మొత్తం 150 కేజీల బరువును ఎత్తి మూడవ స్థానంలో నిలిచారు. మీరాబాయి చాను సాధించిన ఈ విజయం భారత క్రీడా రంగానికి ఒక గొప్ప ప్రోత్సాహాన్ని అందించింది.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310